Follow: @ANNTELUGU
07-12-2024
ANN తెలుగు
# మహా పత్రిక
శనివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 06 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

గుడ్ న్యూస్

## తెలంగాణకు 7 నవోదయ విద్యాలయాలు

- ఒక్కో నవోదయలో 56 మంది విద్యార్థులకు ప్రవేశం
- విజయోత్సవాల వేళ.. కేంద్రం శుభవార్త
- సాధించిన సీఎం రేవంత్.. నాడు కేసీఆర్ ప్రయత్నించినా అందని సహకారం

03

రికార్డులు స్మాష్

## పుష్పరాజ్ రికార్డుల మోత



- మొదటిరోజే ఇండియన్ బాక్సాఫీస్ షేక్
- రూ.294 కోట్ల గ్రాస్‌తో రాజమౌళి రికార్డులు బద్దలు
- రేవతి కుటుంబానికి రూ.25లక్షల సాయం ప్రకటించిన అల్లుఅర్జున్

03

ఇంపార్టెన్స్

## రంగంలోకి కేసీఆర్



- 8న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కీలకభేటీ
- తాజా రాజకీయ పరిణామాలపై కీలక నిర్ణయం

03




## మళ్ళీ రైతుల ఢిల్లీ మార్చ్

రైతులు మళ్ళీ ఢిల్లీ బాట పట్టారు. గతంలో రైతు వ్యతిరేక చట్టాల ఆందోళన కేంద్రానికి ఎంత సవాల్ గా మారిందో తెలిసిందే. దెబ్బకు ప్రధాని మోడీ కూడా దిగొచ్చి పార్లమెంట్ వేదికగా ఉపసంహరణ ప్రకటన చేశారు. ఇపుడు మళ్ళీ కనీస మద్దతు ధర డిమాండ్‌తో "ఛలో ఢిల్లీకి" పిలుపునిచ్చిన పంజాబ్ రైతులు ఆందోళనలను ఆదివారానికి వాయిదా వేశారు. శనివారం కేంద్రప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. "వారు చర్చలకు సిద్ధమని ప్రకటించారు. అందుకే శనివారం వరకు వేచి చూస్తాం. మేము చర్చలు జరగాలనే కోరుకుంటున్నాం. ప్రభుత్వంతో సంఘర్షణ జరగాలని అనుకోవడం లేదు. మేము శాంతియుతంగానే వ్యవహరిస్తాం" అని రైతు సంఘాల నాయకుడు శర్వణ్ సింగ్ పంధేర్ అన్నారు.

వివరాలు 4లో

### అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీగా ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి




**హైదరాబాద్, మహా :** తెలంగాణలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం వైస్ ఛాన్సలర్‌ను నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీగా ప్రొఫెసర్ ఘంటా చక్రపాణిని నియమిస్తూ ఉత్తర్వులు వెల్లడించింది. ఈ పదవిలో చక్రపాణి మూడేండ్ల పాటు కొనసాగనున్నారు. గతంలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో సోషియాలజీ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా చక్రపాణి విధులు నిర్వర్తించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత టీఎస్‌పీఎస్సీ తొలి చైర్మన్‌గా ఘంటా చక్రపాణి సేవలందించారు.

# జన్ లోక్ పాల్ సంచలన సర్వే

## ఫస్ట్ ఇయర్ రిపోర్ట్.. తెలంగాణలో దూసుకొస్తున్న కమలం

### కాంగ్రెస్ దే అగ్రాసనం.. కారుకు కష్టకాలం

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రంలో కమలం బలపడుతున్నది. అధికార కాంగ్రెస్ పార్టీ అగ్రస్థానంలో ఉన్నా.. క్రమంగా పట్టు గత ఏడాది స్థాయిలో లేదని జన్ లోక్ పాల్ సంచలన సర్వే విడుదల చేసింది. ఏడాది కాంగ్రెస్ పాలనపై జన్ లోక్ పాల్ సంచలన సర్వే బయటపెట్టగా, ఇందులో కమలంపార్టీ అనూహ్యంగా విస్తరిస్తున్నదని స్పష్టమైంది. కారుకు కష్టకాలం కొనసాగుతుండగా, ఎనిమిది మంది ఎంపీల ప్రభావంతో ఆయా ప్రాంతాల్లో కమలం విస్తరణ జరుగుతున్నదని స్పష్టమవుతోంది. కారు పార్టీకి కష్టాలు కొనసాగుతున్నాయని లోక్ జన్ పాల్ సర్వే వెల్లడించిది. అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల సమయల్లో లోక్ జన్ పాల్ ఫలితాలు దాదాపు నిజమయ్యాయి. దీంతో తాజా ట్రెండ్స్ పై ఆసక్తి వ్యక్తమవుతోంది. తాజాగా జన్ లోక్ పాల్ లెక్కల ప్రకారం కాంగ్రెస్‌కు 49 వరకు గరిష్ఠంగా స్థానాలు లభిస్తాయి. బిఆర్ఎస్ పార్టీ 22 నుండి 27లోపు స్థానాలు, బిజెపి 3540 స్థానాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రజావిజయోత్సవాలు, సంక్షేమ ప్రగతి జాతర నేపథ్యంలో కాంగ్రెస్ స్వల్పంగా పుంజుకుని ఉండవచ్చునని పేర్కొంటున్నారు.




| బంగారం ధరలు | |
|---|---|
| 24 క్యారెట్ | 77,620 |
| 22 క్యారెట్ | 71,150 |
| సిల్వర్ (కేజీ) | 92,000 |

| స్టాక్ మార్కెట్ | |
|---|---|
| సెన్సెక్స్ | 81,690.63 |
| నిఫ్టీ | 24,680.05 |

ఈరోజు చికెన్ ధరలు

| 1 కేజీ రిటైల్ ధర | చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|---|
| 1 కేజీ రిటైల్ ధర | 170 | 210 | 220 |
| హోల్ సేల్ ధర | 190 | 230 | 250 |

ఈరోజు గుడ్డు ధరలు

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 6.20 | 186 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 6.20 | 186 |
| రిటైల్ గుడ్డు ధర | 6.57 | 197.16 |

# తెలంగాణ తల్లికి కొత్త రూపు

## ఆకుపచ్చ చీర, చేతిలో వరి, మొక్కజొన్న కంకులు

## మూర్తీభవించిన మానవత్వం

### 9న సచివాలయంలో ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి


### కేసీఆర్ ఆనవాళ్ళు చెరిపినట్లేనా?

**తెలంగాణ తల్లికి కొత్తరూపాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది. ఈనెల 9న సెక్రటేరియట్ ముందు ఏర్పాటు చేయనున్న తెలంగాణ తల్లి విగ్రహం నమూనా విడుదల చేయగా, వైరల్ అయింది. ఆకుపచ్చ చీర, చేతిలో వరి, మొక్కజొన్న కంకులు పట్టుకున్న రూపంలో విగ్రహం దర్శనమిచ్చింది. ఈ విగ్రహాన్ని 9న సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారు. మూర్తీభవించిన మానవత్వంతో తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించారు. ఈ విగ్రహంపై బీఆర్ఎస్ తీవ్రంగా ఆక్షేపిస్తోంది. గతంలో ఉన్న విగ్రహం గులాబీరంగుచీరలో కిరీటం ధరించి ఉండగా, ప్రస్తుత విగ్రహంలో ఆకుపచ్చ చీర, కిరీటం లేకుండా ఉంది.**

- మహా, హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రం అస్తిత్వానికి, స్వాభిమానానికి, సాధికారతకు ప్రతీక తెలంగాణ తల్లి. తెలంగాణ తల్లి ప్రస్తావన పూర్వకాలం నాటిదే అని చెప్పాలి. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం కాలంలోనే ఎందరో కవులు తెలంగాణ తల్లి పేరును ప్రస్తావిస్తూ పద్యాలు, పాటలు రచించారు. ఉమ్మడి రాష్ట్రంలో నిరాదరణకు గురైన తెలంగాణ తల్లి.. మలిదశ తెలంగాణ ఉద్యమంలో మరోసారి ఊపిరి పోసుకుంది. సమైక్యవాదులు తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షకు విరుద్ధంగా, సమైక్య రాష్ట్ర ప్రతీకగా తెలుగు తల్లిని నిలపే ప్రయత్నాలు చేశారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ సాహిత్యకారులు, కళాకారులు తెలంగాణ తల్లి రూపురేఖలను గుర్తించి చర్చలు పెట్టారు. దాని తరువాత తెలంగాణ తల్లిని ఇప్పటివరకు ఉన్న విగ్రహం మాదిరి రూపొందించారు. తెలంగాణ ఉద్యమం నేపథ్యంలోనూ.. రాష్ట్రం సిద్ధించాక కూడా చాలా వరకు గ్రామాల్లో స్వచ్ఛందంగా తెలంగాణ తల్లి విగ్రహాలను ప్రతిష్ఠించారు. సమైక్య రాష్ట్ర అస్తిత్వానికి ప్రతీకగా తెలుగుతల్లి విగ్రహం గతంలో సెక్రటేరియట్ ముందు ఉండేది. స్వరాష్ట్రం వచ్చాక కొత్త సెక్రటేరియట్ భవనం నిర్మాణం పూర్తయ్యాక ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ.. ఇంతలోనే రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయింది. అయితే.. తెలంగాణ సెక్రటేరియట్ ముందు తెలంగాణ తల్లి విగ్రహం ఉండడం చారిత్రక న్యాయమని గతంలోనే నిర్ణయించారు.

మిగతా 2లో




## తెలంగాణ తల్లిరూపంపై తొలిగిన సస్పెన్స్

- రాష్ట్రంలోని సగటు మహిళను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ తల్లికి రూపం
- రూ.5.30 కోట్ల వ్యయంతో తెలంగాణ తల్లి విగ్రహం

02

పోలీసు పేరు వినిపిస్తే చాలు

## నేరగాళ్లు భయపడాలి

### ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచే బాధ్యత మీదే

- పైరవీలకు తావులేకుండా పోలీసుశాఖలో పదోన్నతులు
- ట్రాన్స్‌జెండర్లకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు
- యంగ్ ఇండియా పోలీసు స్కూలుకు 50 ఎకరాలు.. సీఎం రేవంత్
- ఎస్డీఆర్ఎఫ్ వాహనాలు, బోట్లు ప్రారంభించిన ముఖ్యమంత్రి



**హైదరాబాద్, మహా:** నేరగాళ్ల హోదా చూసి పోలీసులు వెనక్కి తగ్గవద్దని, వాళ్లకు ప్రొటోకాల్ వర్తించదని పోలీసులు గ్రహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడి అన్నారు. పోలీసు పేరు వినిపిస్తే చాలు.. నేరగాళ్లు భయపడేలా ఉండాలన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయ్యిందని, ఒత్తిడి, పైరవీలకు తావులేకుండా పోలీసుశాఖలో పదోన్నతులు, బదిలీలు చేశామని సీఎం రేవంత్రెడ్డి అన్నారు. పీజీలు, పీహెచ్‌డీలు చేసినవారూ కాని స్టేబుళ్లుగా వస్తున్నారని

మిగతా 2లో

## ఆకాశం జిగేల్ అనేలా..

### చరిత్రలో నిలిచిపోయేలా ప్రజాపాలన సంబురాలు



వివరాలు 2లో



## ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం చేశారు

### కేసీఆర్‌పై భట్టి విక్రమార్క ఫైర్


వివరాలు 3లో

15 లక్షల కోట్లు

## పెరిగిన సంపద

- గత ఐదు రోజుల్లో పరుగులు పెట్టిన మార్కెట్ క్యాప్
- వరుస లాభాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు
- ఒక్కరోజే సెన్సెక్స్ 810, నిఫ్టీ 241 పాయింట్లు వృద్ధి
- ఐటీ, టెక్ కంపెనీల షేర్లు ఆకర్షణీయం

వివరాలు 7లో



## తెలంగాణ తల్లికి
# కొత్త రూపు




(మొదటిపేజీ తరువాయి)
ఇదే విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణ కవులు, కళాకారులు, పాత్రికేయుల పక్షాన శ్రీరాహుల్‌గాంధీకి విజ్ఞప్తి చేశారు. ఇందులో భాగంగా సెక్రటేరియట్ ముందు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మరో మూడు రోజుల్లోనే విగ్రహాన్ని ప్రతిష్ఠించబోతున్నారు. అయితే.. గతంలో ఉన్న మాదిరి విగ్రహం కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో విగ్రహంలో మార్పులు తీసుకొచ్చారు. అయితే.. తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మారుస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పినప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా కూడా ఆసక్తి నెలకొంది. కొత్త విగ్రహం ఎలా రూపుదిద్దుకోబోతోంది.. ఎలా ఉండబోతోంది.. అన్న చర్చ సాగింది. మరో మూడు రోజుల్లోనే ప్రతిష్ఠాపనకు నోచుకోనున్న నేపథ్యంలో తాజాగా తెలంగాణ తల్లి విగ్రహం నమూన బయటకు వచ్చింది. దీంతో ఇప్పటివరకు ఉన్న ఉత్కంఠకు తెరపడినట్లయింది. ఈ నమూనాపై బిఆర్ఎస్ భగ్గుమంటుండగా, కొత్త నమూనా బాగుందని కాంగ్రెస్ శ్రేణులు అంటున్నాయి. కేసీఆర్ ఆనవాళ్ళు చెరిపేయడంలో భాగంగానే తెలంగాణ తల్లి విగ్రహ నమూనా రూపం మార్చారన్న అభిప్రాయం విశ్లేషకుల నుండి వినపడుతోంది.

### తెలంగాణ తల్లిరూపంపై తొలిగిన సస్పెన్స్

తెలంగాణ తల్లిరూపంపై సస్పెన్స్ వీడింది. ఈనెల 9న సచివాలయం ప్రాంగణంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్న తెలంగాణ తల్లి విగ్రహనమూనా బహిర్గతమైంది. బంగారు అంచుతో కూడిన పచ్చటి చీర, ఎరుపు రంగు జాకెట్ నుదుటన తిలకంతో తెలంగాణ తల్లి రూపు దిద్దుకుంది. చేతిలో మొక్కజొన్న వరి సజ్జలున్నాయి. విగ్రహం కింద గద్దెపై బిగించిన పిడికిలిని చిత్రీకరించారు. రాష్ట్రంలోని సగటు మహిళను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ తల్లిని తీర్చిదిద్దినట్లు ప్రభుత్వవర్గాలు తెలిపాయి.

#### రూ.5.30 కోట్ల వ్యయంతో తెలంగాణ తల్లి విగ్రహం

జవహర్‌లాల్ నెహ్రూ ఫైనాన్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ గంగాధర్ ఆ చిత్రానికి రూపకల్పన చేశారు. ప్రముఖ శిల్పి రమణారెడ్డి బృందం కాంస్యవిగ్రహాన్ని తయారుచేసింది. 17 అడుగుల కాంస్య విగ్రహాన్ని సిద్ధం చేసింది. విగ్రహాన్ని ఇప్పటికే సచివాలయం ప్రాంగణానికి తరలించారు. విగ్రహం ఎత్తు 17 అడుగులు కాగా కిందిగద్దె మరో మూడు అడుగులతో రూపొందించారు. సుమారు ఐదున్నర కోట్ల రూపాయలతో తెలంగాణ తల్లి విగ్రహం, పరిసరాల్లో ఫౌంటెన్ పచ్చిక బయళ్లను తీర్చిదిద్దారు.

# విగ్రహంపై వివాదం
## అపుడూ.. ఇపుడూ తేడాలివే

**హైదరాబాద్, మహా:** తెలంగాణ తల్లి విగ్రహంపై రాజకీయ వివాదం నడుస్తోంది. ప్రస్తుతం ఉన్న విగ్రహం రూపాన్ని మారుస్తూ.. కొత్త విగ్రహాన్ని ఈనెల9వ తేదీన ఆవిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య కొద్దిరోజులుగా మాటల యుద్ధం నడుస్తోంది. తెలంగాణ తల్లి విగ్రహాన్ని దొరసానిలా రూపొందించారని కాంగ్రెస్ విమర్శిస్తుంటే.. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని, దీనిలో భాగంగా తెలంగాణ తల్లి రూపాన్ని మార్చాలనే ప్రయత్నం చేస్తోందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఓ సాధారణ మహిళలా తెలంగాణ తల్లిని రూపొందిస్తున్నామని కాంగ్రెస్ చెబుతుండగా.. తెలంగాణ తల్లి రూపం ధనిక మహిళగా ఉంటే వచ్చే నష్టం ఏమిటని బీఆర్ఎస్ ప్రశ్నిస్తోంది. మరో మూడు రోజుల్లో కొత్త తెలంగాణ తల్లి రూపాన్ని ఆవిష్కరించనున్న నేపథ్యంలో కొత్త విగ్రహానికి సంబంధించిన రూపం బయటకు వచ్చింది. ఓ సాధారణ మహిళను తలపించేలా విగ్రహం ఉండగా.. గత విగ్రహానికి ప్రస్తుత విగ్రహానికి పోలికల్లో ఎన్నో తేడాలు ఉన్నాయి. ప్రభుత్వాలు మారినప్పుడల్లా విగ్రహం రూపాలను మార్చడం సరికాదని బీజేపీ అంటోంది. ఇటీవల తెలంగాణ గేయం విషయంలోనూ వివాదం నెలకొన్నప్పటికీ తెలంగాణ ప్రభుత్వం పాత గేయం స్థానంలో కొత్త గేయాన్ని తీసుకొచ్చింది. తాజాగా తెలంగాణ తల్లి విగ్రహం విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం గత రూపాన్ని మారుస్తూ ఓ సాధారణ మహిళ రూపాన్ని తలపించేలా కొత్త రూపాన్ని రూపొందించింది.

### అప్పటికీ.. ఇప్పటికీ తేడాలివే..

- పాత తెలంగాణ తల్లి విగ్రహంలో తెలంగాణ తల్లి జరీ అంచు పట్టు చీర ధరించగా.. కొత్త విగ్రహంలో పసుపు పచ్చ అంచుతో ఆకుపచ్చ చీర ధరించి ఉంది.
- పాత విగ్రహంలో తలకు కిరీటం, చేతిలో బతుకమ్మ ఉండగా.. కొత్త విగ్రహంలో కిరీటం, చేతిలో బతుకమ్మ లేదు.
- గత విగ్రహంలో తెలంగాణ తల్లి చేతికి బంగారు గాజులు ఉండగా, ప్రస్తుతం మట్టి గాజులు ధరించి తెలంగాణ తల్లి విగ్రహం కనిపిస్తోంది.
- గత విగ్రహం రాజమాతలా ఉందనే విమర్శలు రాగా.. కొత్త విగ్రహం సాధారణ మహిళ రూపాన్ని తలపిస్తోంది.
- పాత విగ్రహంలో వెండి మెట్టెలు, నగలు కిరీటం ఉండగా.. కొత్త విగ్రహంలో మెడలో కంటి ఆభరణం మాత్రమే కనిపిస్తోంది.
- పాత విగ్రహంలో కుడి చేతిలో మక్క కంకులు ఉండగా.. కొత్త విగ్రహం కుడి చేతిలో అభయ హస్తం కనిపిస్తోంది.
- పాత విగ్రహంలో ఎడమ చేతిలో బతుకమ్మ ఉండగా.. కొత్త విగ్రహంలో ఎడమ చేతిలో వరి, జొన్న, సజ్జ కంకులు ఉన్నాయి. రెండు విగ్రహాల రూపాలకు స్పష్టమైన తేడా కనిపిస్తోంది.





# .. నేరగాళ్లు భయపడాలి

(మొదటిపేజీ తరువాయి)
వ్యాఖ్యానించారు. సైబర్, డ్రగ్స్ పేరుతో కొత్త నేరాలు పుట్టుకొస్తున్నాయని, సైబర్‌క్రైమ్ నివారణ దిశగా యువతకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని తెలిపారు. గంజాయి, కొకైన్, హెరాయిన్ రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్నాయని పేర్కొన్నారు. టీజీన్యాబ్‌కు డీజీపీ స్థాయి అధికారిని నియమించామని గుర్తుచేశారు. ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఇవాళ ఎస్డీఆర్ఎఫ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని రాష్ట్ర విపత్తు నిర్వహణ దళాన్ని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ప్రారంభించారు. ఈ మేరకు అంతముందు సీఎం రేవంత్రెడ్డి ఎన్టీఆర్ మార్గ్ వద్ద జెండా ఊపి ఎస్డీఆర్ఎఫ్ వాహనాలు, బోట్లను ప్రారంభించారు. అనంతరం హెచ్ఎండీఏ మైదానంలో ఏర్పాటు చేసిన ఎస్డీఆర్ఎఫ్ స్టాల్ను సందర్శించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలోని ఎస్డీఆర్ఎఫ్ లోగోను ఆవిష్కరించి ప్రజలను ఉద్దేశిస్తూ మాట్లాడారు. తెలంగాణకు రావాలంటే డ్రగ్స్ రవాణాదారులు భయపడాలని సీఎం రేవంత్ ఉద్ఘాటించారు. డ్రగ్స్ విషవలయం గురించి పాఠశాలలు, కళాశాలల్లో చెప్పాలని సూచించారు. ప్రత్యేక శిక్షణ తీసుకున్న వారితో విద్యార్థులకు పాఠాలు చెప్పాలని తెలిపారు. పిల్లల భవిష్యత్తు గురించి పాఠశాల యాజమాన్యాలకు బాధ్యత ఉండాలని పేర్కొన్నారు.



### ట్రాన్స్‌జెండర్లకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

విద్యాసంస్థల యాజమాన్యాలతో కమిషనర్లు సదస్సులు నిర్వహించాలని సీఎం రేవంత్ ఆదేశించారు. డ్రగ్స్, గంజాయి కేసులు త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసి 6 నెలల్లోగా తీర్పులు వచ్చేలా చూస్తామని వెల్లడించారు. హైదరాబాద్‌లో చెరువులు, నాలాలు రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ట్రాన్స్‌జెండర్ల సమస్యలను మానవీయ కోణంలో చూస్తామని, వారిని ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమిస్తున్నామని తెలిపారు. ట్రాన్స్‌జెండర్లకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పారు. విధినిర్వహణలో మరణించిన పోలీసుల కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

### హోంగార్డుల వేతనాలు పెంపు

రాష్ట్రంలో 14 వేల మంది హోంగార్డులు ఉన్నారని, వారికి రోజుకు రూ.వెయ్యి వేతనం ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వీక్లీ పరేడ్ అలవెన్స్ రూ.200 చేస్తామని తెలిపారు. మరణించిన హోంగార్డుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ఇస్తామని చెప్పారు. హోంగార్డులకు మెరుగైన వైద్యసాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పోలీసుల పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందిస్తామని, ఇప్పటికే యంగ్ఇండియా పోలీసు స్కూలుకు 50 ఎకరాలు కేటాయించామని గుర్తుచేశారు. హోంగార్డు నుంచి డీజీపీ వరకు ఏ అధికారి పిల్లలైనా ప్రవేశం పొందవచ్చని తెలిపారు.

### కొందరు పోలీసుల తీరుతో అందరికీ చెడ్డపేరు

రాష్ట్రంలో మొత్తం 94 వేలమంది పోలీసులు ఉన్నారని, ఎక్కడ తీవ్రవాద కార్యకలాపాలు జరిగినా మనవాళ్ల సాయం తీసుకుంటున్నారని సీఎం రేవంత్ తెలిపారు. పోలీసు ఉద్యోగం అనేది భావోద్వేగం, ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచే బాధ్యత అని వ్యాఖ్యానించారు. బాధితుల పట్ల పోలీసులు మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే నేరగాళ్లు, కబ్జారాయుళ్లకు అండగా ఉండటం కాదని హితవు పలికారు. కొందరు పోలీసుల తీరు వల్ల అందరికీ చెడ్డ పేరు తెస్తోందని పేర్కొన్నారు. పేదలు, సామాన్యులు, బాధితులకు పోలీసులు అండగా ఉండాలని స్పష్టం చేశారు.

# ఆకాశం జిగేల్ అనేలా...

## చరిత్రలో నిలిచిపోయేలా ప్రజాపాలన సంబురాలు

### ట్యాంక్ బండ్‌పై డ్రోన్ షో.. లేజర్ షో
### మురిసేలా ముగింపు.. వినూత్న రీతిలో కార్నివాల్
### ప్రభుత్వ పథకాలతో ప్రదర్శన.. ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షిస్తున్న సీఎం రేవంత్

**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్న సందర్భంగా ప్రజాపాలన ప్రజా వియోజత్సవాలను ఘనంగా నిర్వహిస్తుంది. డిసెంబర్ 1 నుంచి 9 వరకు ఈ కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించుకున్న మేరకు ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుంది. ఒక్కోరోజు ఒక్కో విధంగా కార్యక్రమాలను చేపట్టాలని షెడ్యూల్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వం వియోజత్సవ వేడుకలను నిర్వహిస్తూ వస్తుంది. అయితే, విజయోత్సవాల ముగింపు వేడుకలను డిసెంబర్ 9న ట్యాంక్ బండ్ పై అట్టహాసంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తుంది. ఆరోజు ముందుగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఆ తరువాత కార్నివాల్, లేజర్ షో, డ్రోన్ షో, ఫైర్ వర్క్స్, ఆర్ట్ గ్యాలరీ, వివిధ స్టాల్స్, సాంస్కృతి కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహించనున్నది. తెలంగాణ తల్లి విగ్రహానికి సంబంధించిన నమూనాను విడుదల చేసింది. సామాన్య మహిళా రూపంలో తెలంగాణ తల్లి రూపంలో నమూనా అందరినీ ఆకట్టుకుంటుంది. ఆకుపచ్చ చీరను ధరించి, మట్టి గాజులను ధరించిన చేతిలో వరికొయ్యలు, జొన్న, మొక్కజొన్న కంకులను చేత పట్టుకుని తెలగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడుతూ పోరాట స్ఫూర్తిని తెలిపేలా నూతన విగ్రహాన్ని రూపొందించారు. నగరం నడిబొడ్డున ఉన్న రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని సోమవారం లక్షల మంది మహిళా శక్తి సభ్యుల సమక్షంలో సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారు. అనంతరం ప్రజాపాలన ముగింపు వేడుకలు ప్రారంభంకానున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్ మార్గాల్లో నిర్వహించే కార్నివాల్, లేజర్ షో, సాంస్కృతి కార్యక్రమాలు అలరించనున్నాయి. ఈ ఉత్సవాల ద్వారా మహిళా సాధికారత, రైతు సంక్షేమం, యువతకు ఉపాధి వంటి అనేక అంశాలలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషిని ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రభుత్వం ప్రణాళిక చేసింది. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పెద్ద ఎత్తున ఈ ఉత్సవాల్లో పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ప్రభుత్వం ఇప్పటికే పూర్తి చేసింది.

**కార్నివాల్, లేజర్ షో**

ప్రజలను అలరించేందుకు కార్నివాల్, లేజర్ షోలను నిర్వహిస్తుంటారు. కార్నివాల్, లేజర్ షో అనగా వినూత్న రీతిలో రంగురంగుల లైట్ల ప్రదర్శన ఉంటుంది. అందుకు అనుగూణంగా అలరించే మ్యూజిక్, గ్రాఫిక్, స్టోరీ టెల్లింగ్ ను అటాచ్ చేస్తారు. అత్యాధునిక విజువల్స్, వాటి ఉత్కంఠభరితమైన కలయికతో ఎంతో ఆకర్షణమైన వినోదాన్ని అందిస్తూ హైలెట్ గా నిలుస్తుంది. మొత్తంగా ఈ ప్రదర్శనలు మరిచిపోలేని అనుభూతితో వీక్షకులను మంత్రముగ్ధలను చేస్తాయి. ఈ షోలను డిసెంబర్ 9న ముగింపు వేడుకల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రదర్శించనున్నారు. వీటి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పథకాలను, కీలక నిర్ణయాలను, రాష్ట్ర ప్రగతిని, తెలంగాణ కీర్తి ప్రతిష్టలు, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రదర్శించనున్నారు. ప్రధానంగా ప్రభుత్వ 6 గ్యారెంటీలలో భాగంగా అమలు చేస్తున్న ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రైతు రుణమాఫీ, నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఉచిత విద్యుత్, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, ఆరోగ్య శ్రీ కవరేజీని రూ. 10 లక్షలకు పెంపు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థల ఏర్పాటు తదితర పథకాలపై ఆకట్టుకునేలా కార్నివాల్, లేజర్ షో ప్రదర్శనలను నిర్వహించనున్నారు. దీంతో ట్యాంక్ బండ్ ప్రాంతమంతా ఆరోజు లైట్ల వెలుగులతో జిగేల్ జిగేల్ మననున్నది.



**భారీ డ్రోన్ షో..**

ముగింపు ఉత్సవాల్లో డ్రోన్ షోను కూడా నిర్వహించనున్నారు. భారీ సంఖ్యలో ఈ డ్రోన్లను ఆకాశానికి ఒకేసారి ఎగరవేస్తారు. వాటికి లైట్లను జోడించడంతో అవి రంగురంగుల వెలుగుల్లో కనిపిస్తాయి. భారీ సంఖ్యలో తాము ఏ విధంగా, ఏ రూపంలో కావాలనుకుంటే ఆ విధంగా ఈ డ్రోన్లను ప్రదర్శన చేస్తుంటారు. దీంతో అవి ఆకాశంలోకి ఎగిరిగా అందంగా కనిపిస్తాయి. ఈ డ్రోన్ ప్రదర్శనను చూస్తుంటే చీకటి సమయంలో ఆకాశంలో చుక్కలను చూస్తే ఎటువంటి ఫీలింగ్ కలుగుతుందో అదేవిధంగా డ్రోన్ ప్రదర్శన ఉంటుంది. ఈ డ్రోన్లన్నీ చుక్కల మాదిరిగా ఓ రూపంలో ఆకాశంలో ఎగురుతూ కనిపిస్తాయి. ఎయిర్ విమానాలు గాల్లో ప్రదర్శనలు చేసినట్టుగా అందంగా ఈ డ్రోన్ల షో ఉంటుంది. పక్షులు ఆకాశంలో పలు ఆకారాలలో విహరిస్తున్నప్పుడు చూస్తే కలిగే అనుభూతి ఈ డ్రోన్ షో ద్వారా కలుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వానికి సంబంధించిన పథకాలు, ప్రభుత్వ ప్రత్యేకత, ప్రముఖులకు సంబంధించిన రూపాలు వచ్చేలా డ్రోన్ల షో ద్వారా ఆకాశంలో ప్రదర్శన చేసి అలరించనున్నారు. కింద భాగాన హుస్సేన్ సాగర్ నది భాగం.. ఆకాశంలో డ్రోన్ల వెలుగులు.. ఎంతో అద్భుతంగా ఈ కార్యక్రమం ఉండనున్నది. దీనిని నిపుణుల ఆధ్వర్యంలో మాత్రమే నిర్వహిస్తారు. అయితే, ఈ షో నిర్వహణ తెలంగాణలో మొదటిది కానున్నది. గతంలో ఇదివరకెప్పుడూ నిర్వహించలేదు.

### ఫైర్ వర్క్స్..

కార్నివల్, లేజర్ షోతోపాటు ఫైర్ వర్క్స్ ను కూడా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఫైర్ వర్క్స్ అనగా తక్కువ పేలుడు శబ్దంతో సౌందర్యం, వినోదం ప్రయోజనాల కోసం బాణాసంచాను వినూత్న రీతిలో పేల్చుతుంటారు. ఈ బాణాసంచ ప్రదర్శన కూడా వీక్షకులను ఎంతగానో అలరిస్తుంటాయి. ఒక రకంగా పండుగ వాతావరణాన్ని తలపిస్తుంటది. ఈ ప్రదర్శనను కూడా గతంలో ఎన్నడూ లేని విధంగా అద్భుత రీతిలో నిర్వహించేందుకు ఏర్పాట్లను సిద్ధం చేశారు. ముగింపు వేడుకల్లో కార్నివాల్, లేజర్ షో, డ్రోన్ షో, ఫైర్ వర్క్స్ తోపాటు ఆర్ట్ గ్యాలరీ, వివిధ స్టాల్స్, సాంస్కృతి కార్యక్రమాలను తెలంగాణ సహజత్వం ఉట్టిపడేలా నిర్వహించనున్నారు. ఈ అన్ని ఏర్పాట్లను చూస్తుంటే ముగింపు వేడుకలతో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఖచ్చితంగా ప్రత్యేక గుర్తింపు వస్తుందని పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# అసెంబ్లీలో నూతన టూరిజం పాలసీ

- **టూరిజంపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష.. దుబాయ్, సింగపూర్ తరహాలో హైదరాబాద్ షాపింగ్**
- **కాన్సెప్ట్ టూరిజం పైన దృష్టి సారించాలి.. డెస్టినేషన్ వెడ్డింగ్ లకు అనువైన ప్రదేశాలను గుర్తించి అభివృద్ధి చేయండి**

**హైదరాబాద్, మహా** టూరిజం పాలసీపై సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గత పదేళ్లలో తెలంగాణకు ప్రత్యేక టూరిజం పాలసీ తయారు చేయలేదని అన్నారు. శుక్రవారం తెలంగాణ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టూరిజం పాలసీపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. దుబాయ్, సింగపూర్, చైనా దేశాలను అధ్యయనం చేయాలని సూచించారు. దుబాయ్, సింగపూర్ తరహా షాపింగ్ హైదరాబాద్ లో ఏర్పాటు చేయాలని తెలిపారు. హైదరాబాద్ వాతావరణం 365 రోజులు బాగుంటుందని.. దానికి అనుగుణంగా టూరిజాన్నీ అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. తమిళనాడు తరహా ఆటోమొబైల్ పరిశ్రమ హైదరాబాద్ లో అభివృద్ధి అయ్యేలా చూడాలని చెప్పారు. టైగర్ రిజర్వు ఫారెస్ట్ ప్రాంతాల్లో పర్యాటకులు పెరిగేలా చూడాలని అన్నారు. టైగర్ రిజర్వు ఫారెస్ట్ లను దేవాలయాలతో కనెక్ట్ చేయాలని సూచించారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర నుంచి పులులు తెలంగాణ వైపు వచ్చే వాతావరణాన్ని ఏర్పాటు చేయాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పల్ల టెంపుల్ టూరిజం పెరిగిందని అన్నారు. రోటిన్ టూరిజం కాకుండా కాన్సెప్ట్ టూరిజం పైన దృష్టి సారించాలని అన్నారు.

**ఫ్యూచర్ సిటీలో మెగా కన్వెన్షన్ సెంటర్**

ఫ్యూచర్ సిటీలో మెగా కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు పైన అధ్యయనం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఎయిర్ ఫోర్ట్ నుంచి 20 నిమిషాల్లో మెగా కన్వెన్షన్ సెంటర్ కు చేరుకునేలా ఉండాలని సూచించారు. డెస్టినేషన్ వెడ్డింగ్ లకు అనువైన ప్రదేశాలను గుర్తించి అభివృద్ధి చేయాలన్నారు. పర్యాటక శాఖ స్థలాల లీజులపైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీశారు. టూరిజం స్థలాలు, లీజులపైన సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. లీజు ముగిసినా ఖాళీ చేయని వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కోర్టు కేసులను సీరియస్ గా తీసుకోని స్టే లు ఎత్తివేసే లా చూడాలని స్పష్టంచేశారు. అడ్వకేట్ జనరల్ తో చర్చించి మంచి న్యాయవాదులను ఏర్పాటు చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. మంచి గుర్తింపు ఉన్న కంపెనీలకు పర్యటక స్థలాలు లీజ్ కు ఇవ్వాలని సూచించారు. తెలంగాణలో టూరిజం అభివృద్ధి కి మంచి అవకాశాలు ఉన్నాయని వివరించారు. ఎయిర్ ఫోర్ట్ నుంచి మూడు గంటల్లో తెలంగాణలో ఎక్కడికైనా చేరుకోవచ్చని అన్నారు. తెలంగాణలో శాంతిభద్రతలు బాగున్నాయని.. గ్రామీణ రోడ్లు బాగున్నాయి...అన్ని రకాల ఆహారం దొరుకుతుందని తెలిపారు. ఉస్మానియా ఆస్పత్రిని ఖాళీ చేయించి మంచి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామన్నారు. ఛార్మినార్ కు పర్యాటకులు పెరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అసెంబ్లీలో నూతన టూరిజం పాలసీని ప్రవేశ పెట్టి సమగ్రంగా చర్చ జరిగేలా చూద్దామన్నారు. సొంత కాళ్ల పైన నిలబడేలా టూరిజం శాఖ కసరత్తు చేయాలని అన్నారు. వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న టూరిజం పాలసీలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఈ సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, టూరిజం శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్, టూరిజం శాఖ ఎండీ ప్రకాష్ రెడ్డి, సీఎంవో ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి పాల్గొన్నారు.



# ప్రముఖులకు వలపు వల

**రాజన్న సిరిసిల్ల జిల్లాలో కిలాడీ హోంగార్డు.. అరెస్ట్ చేసిన పోలీసులు**




**కరీంనగర్, మహా:** సంపన్నులు, ధనికులు, వ్యాపారులను టార్గెట్ గా వలపు వల విసురుతూ అందినకాడికి దండుకుంటున్న వేములవాడకు చెందిన వడ్ల అనూష అనే లేడీ హోంగార్డును పోలీసులు అరెస్ట్ చేశారు. భర్త ఆరోగ్యం బాగులేదంటూ, డబ్బున్న బడా బాబులను టార్గెట్ చేస్తూ రూ. లక్షల్లో డిమాండ్ చేసింది కిలాడీ లేడీ. రిటైర్డ్ ఏఈ ద్వారకా శేఖర్ దగ్గర రూ. 3,50,000 అప్పుగా తీసుకొని, తిరిగి అడిగితే పెళ్లి చేసుకున్నట్లు మార్ఫింగ్ ఫొటోలు సృష్టించి బ్లాక్ మెయిల్ చేసింది. మరోసారి రూ. 5 లక్షలు ఇవ్వాలని బ్లాక్ మెయిల్ కు పాల్పడింది. ఎక్కడ పరువు పోతుందోనని అడిగినంత చెల్లించాడు. అయినప్పటికీ వదలకుండా మరో రూ. 3 లక్షలు ఇవ్వాలని బ్లాక్ మెయిల్ చేయటంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు విచారణ జరుపగా మార్ఫింగ్ ఫొటోలతో భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు వెల్లడైంది. దీంతో అనూషను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇంకా ఎవరైనా అనూష బాధితులు ఉంటే పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని పోలీసులు తెలిపారు.

# పుష్పరాజ్ రికార్డుల మోత

## మొదటిరోజే ఇండియన్ బాక్సాఫీస్ షేక్..

**రూ.294కోట్ల గ్రాస్ తో రాజమౌళి రికార్డులు బద్దలు**

**రేవతి కుటుంబానికి రూ.25లక్షల సాయం ప్రకటించిన అల్లుఅర్జున్**



థియేటర్లలో గంగమ్మ జాతర, బయట కలెక్షన్ల జాతర అన్నట్లుగా 'పుష్ప 2' సినిమా ప్రభంజనం ఉంది. తాజాగా మూవీ టీమ్ డే 1 కలెక్షన్ల వివరాలను తెలియజేశారు. 'ఆర్ఆర్ఆర్' రికార్డులు బద్దలవడమే కాకుండా.. సరికొత్త రికార్డులను పుష్పరాజ్ బాక్సాఫీస్‌కి పరిచయం చేశాడు. ఈ సినిమా ఫస్ట్ డే ఇండియన్ సినిమా హిస్టరీలో ఉన్న రికార్డులన్నింటినీ తుడిచిపెట్టి.. ఆల్ టైమ్ రికార్డ్‌ని క్రియేట్ చేసింది. తాజాగా మేకర్స్ ఫస్ట్ డే కలెక్షన్లతో పోస్టర్ వదిలారు. ఈ పోస్టర్ ప్రకారం ఈ సినిమా రూ. 294 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ని రాబట్టి.. ఇండియన్ సినిమా డే 1 హిస్టరీలో హయ్యెస్ట్ కలెక్షన్స్ రాబట్టి సరికొత్త రికార్డును బాక్సాఫీస్ వద్ద నెలకొల్పింది. ఇంతకు ముందు ఉన్న ఆర్ఆర్ఆర్ డే 1 రికార్డ్ రూ. 233 కోట్ల గ్రాస్. పుష్పరాజ్ డే 1 సెట్ చేసిన రికార్డ్ రూ. 294 కోట్ల గ్రాస్. నైజాం, హిందీ బెల్ట్‌లో కూడా 'పుష్పరాజ్' సరికొత్త రికార్డును క్రియేట్ చేశాడు. నైజాంలో ఇప్పటి వరకు ఉన్న ఆర్ఆర్ఆర్ రూ. 23 కోట్ల రికార్డును రూ. 30 కోట్లు రాబట్టి మరో హిస్టరీని నెలకొల్పాడు పుష్ప. మరోవైపు తొక్కిసలాటలో చనిపోయిన అల్లుఅర్జున్ అభిమాని రేవతి కుటుంబానికి రూ.25లక్షల సాయాన్ని అల్లుఅర్జున్ ప్రకటించారు. జరిగిన సంఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

# మరో ఆడపిల్ల వద్దని..
# ఓ మృగం కిరాతకం

**భార్యను ప్రత్యక్ష సాక్షి కూతురును చంపేశాడు**

**కర్నూలులో అమానుషం.. సభ్య సమాజం కన్నీరు మున్నీరు**



తన భార్య నిండు గర్భిణీ. తొమ్మిదినెలలు నిండాయి. పదోనెల వచ్చింది. ఇంకేముందీ మళ్లీ ఆడపిల్లనే కనబోతోందని ఓ మృగాడు రాక్షసుడిగా మారిపోయాడు. భార్యను కొట్టి చంపేశాడు. ప్రత్యక్ష సాక్షి కూతురు గొంతు నిలిమి ప్రాణం తీశాడు. ఈ కిరాతక చర్య సభ్య సమాజాన్ని కంట తడిపెట్టించింది. ఈ దారుణం కర్నూలు జిల్లా హోళగుంద మండలం హెబ్బటంలో దారుణం చోటు చేసుకుంది. శుక్రవారం వెలుగు చూసిన ఈ అమానుషం వివరాలు ఇవి. హెబ్బటం గ్రామానికి చెందిన సకరప్ప, సలీమా(21) భార్యాభర్తలు. వీరికి మూడేళ్ల కుమార్తె సమీరా ఉంది. ప్రస్తుతం సలీమా. గర్భిణి. సలీమాకు మళ్లీ ఆడపిల్లే పుడుతుందేమోనని సకరప్ప అనుమానించాడు. నిత్యం ఘర్షణ పడుతున్నాడు. గురువారం రాత్రి వీరి మధ్య ఘర్షణ జరగా, ఆవేశంతో సకరప్ప కర్రతో సలీమా తలపై కొట్టి చంపాడు. ఈ అకృత్యానికి ప్రత్యక్ష సాక్షి సమీరా గొంతును నులిమి చంపేశాడు. పోలీసులకు లొంగిపోయారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

# తెలంగాణకు 7 నవోదయ విద్యాలయాలు

**ఒక్కో నవోదయలో 56మంది విద్యార్థులకు ప్రవేశం**

**విజయోత్సవాల వేళ.. కేంద్రం గుడ్ న్యూస్**

**సాధించిన సీఎం రేవంత్.. నాడు కేసీఆర్ ప్రయత్నించినా అందని సహకారం**




**ఢిల్లీ, మహా:** తెలంగాణకు కేంద్రం శుభవార్త చెప్పింది. తెలంగాణలో కొత్తగా 7 నవోదయ విద్యాలయాలు ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. కేంద్ర కేబినెట్ లో తీసుకున్న పలు కీలక నిర్ణయాలను మీడియాకు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. దేశ వ్యాప్తంగా 85 కొత్త కేంద్రీయ విద్యాలయాలు, 28 కొత్త నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు. దేశ వ్యాప్తంగా 85 కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు రూ.5872 కోట్లు ఖర్చు అవుతుందని చెప్పారు. ఒక్కో కేంద్రీయ విద్యాలయంలో 960 మంది విద్యార్థులకు అవకాశం కల్పించినట్లు వివరించారు. దేశ వ్యాప్తంగా 28 నవోదయ విద్యాలయాల కోసం రూ.2359.82 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో నవోదయ విద్యాలయంలో 560 మంది విద్యార్థులకు అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. గతంలో కేసీఆర్ రాష్ట్రంలో నవోదయ విద్యాలయాల కోసం అనేక ప్రయత్నాలు చేసినా, ఐదారేళ్ళు అనేక ప్రెస్ మీట్లలో మాట్లాడినా సాధించలేకపోయారు. ఇపుడు ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఏడాది తిరక్కుండానే సాధించారు. సరిగ్గా ఏడాది పాలన పూర్తవుతున్న సందర్భంగా కేంద్రం రేవంత్ కు గుడ్ న్యూస్ చెప్పింది. ఏడు నవోదయ విద్యాలయాలు మంజూరుచేసింది. రాష్ట్రానికి ఫలితం దక్కింది.

**తెలంగాణలో నూతన కొత్త నవోదయ విద్యాలయాలివే..**

1. జగిత్యాల, 2. నిజామాబాద్, 3. కొత్తగూడెం, 4. మల్కాజ్‌గిరి, 5. మహబూబ్‌నగర్, 6. సంగారెడ్డి, 7. సూర్యాపేటలో కొత్త నవోదయ విద్యాలయాలు


# ఆర్థిక వ్యవస్థ చిన్నా భిన్నం చేశారు

**.. కేసీఆర్ పై భట్టి విక్రమార్క ఫైర్**



**హైదరాబాద్, మహా:** aఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేకుండా కేసీఆర్ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చిన్నా భిన్నం చేసిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. ప్రజలపై భారం వేయకుండా ఆర్థిక శాఖను ముందుకు కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రపంచ వాతావరణం వల్ల గ్రీన్ ఎనర్జీపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి పెట్టిందని చెప్పారు. త్వరలోనే కొత్త విద్యుత్ పాలసీ తీసుకురాబోతున్నామని చెప్పారు. శుక్రవారం గాంధీ భవన్ లో భట్టి విక్రమార్క మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పై తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్ ప్రభుత్వం విద్యుత్ శాఖలో తీసుకున్న నిర్ణయాల వల్ల ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ఒక్క యాద్రాద్రి, భద్రాద్రి పవర్ ప్లాంట్ లో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయం వల్ల ప్రతి ఏటా రూ.170 కోట్లకు పైగా భారం పడుతుందన్నారు. ఛత్తీస్ గడ్ ఒప్పందాల వల్ల రూ.630 కోట్ల ఆర్థిక భారం ప్రభుత్వంపై పడుతుందని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిచేసి యాదాద్రిలో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రారంభిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం తప్పుడు నిర్ణయాల వల్ల విద్యుత్ డిస్కంలపై దాదాపుగా రూ. 10వేల కోట్ల భారం పడుతుందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా 24 గంటల పాటు కరెంటు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని భట్టి విక్రమార్క చెప్పుకొచ్చారు. 50లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. భవిష్యత్ లో అన్ని రకాల విద్యుత్ ఉత్పత్తి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో కరెంట్ కోతలు లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. అన్ని రంగాల విజన్ డాక్యుమెంట్ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ తయారు చేస్తోందని వివరించారు. కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణను అస్తవ్యస్తం చేసిందని మండిపడ్డారు. రాష్ట్రంలో కేసీఆర్ ఉద్యోగ నియామకాలు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. అడ్డగోలుగా మాట్లాడటమే బీఆర్ఎస్ నేతల పని అని విమర్శించారు. గత ప్రభుత్వం తెలంగాణను అప్పుల పాలు చేసిందని ఆరోపించారు. మొత్తం రూ.7 లక్షల కోట్లు అప్పు చేశారని చెప్పారు. తమ ప్రభుత్వం వచ్చాక రూ.52 వేల కోట్లు అప్పు చేసిందని భట్టి విక్రమార్క వివరించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. అప్పులకు అదనపు ఆదాయం కలిపి బ్యాంకులకు కట్టే పరిస్థితి తెచ్చారని విమర్శించారు.సంక్షేమ పథకాలకు రూ.61 వేల కోట్లు వెచ్చించామన్నారు. రైతు భరోసా, రుణమాఫీ, చేయూత, ఆరోగ్యశ్రీ పథకాలకు నిధులు ఇచ్చామని గుర్తుచేశారు.ఎల్‌పీజీ, విద్యుత్ రాయితీ, రైతుబీమా పథకాలకు నిధులు కేటాయించామని అన్నారు. ఉపకారవేతనాలు, డైట్ ఛార్జీలు, కల్యాణలక్ష్మికి నిధులు కేటాయించామని చెప్పారు.ప్రతి ఏడాది క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు.

# యాప్రాల్‌లో అక్రమ నిర్మాణాలపై
# హైడ్రా బుల్ డోజర్స్



**హైదరాబాద్, డిసెంబరు 6:** హైదరాబాద్, మహా : మేడ్చల్ జిల్లా జవహర్ నగర్‌లోని యాప్రాల్‌లో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. నాగిరెడ్డి కుంట నాలాకు ఆనుకుని బఫర్ జోన్లో నిర్మాణాలు చేసిన అక్రమార్కులు. ఫిర్యాదులపై రెవెన్యూ, ఇరిగేషన్, హెచ్ ఎండీఏ, మున్సిపాలిటీ విభాగాధికారుల విచారణ అనంతరం సర్వే నంబరు 14, 32 లోని ప్రభుత్వ భూమిలోకి జరిగి డీఎన్ ఆర్ ఫంక్షన్ హాల్ నిర్మాణం ఉందని నిర్ధారించిన అధికారులు.ప్రైవేటు స్థలానికి చెందిన సర్వే నంబరులో నిర్మించినట్టు కోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చి స్టేటస్ కో ఆర్డర్ తెచ్చుకున్న నిర్మాణదారుడు.ఆ పక్కనే ప్రభుత్వ భూమి సర్వే నంబరు 14, 32లోకి చొరబడి ఫంక్షన్ హాల్‌ను నిర్మించిన యజమాని. ఫంక్షన్ హాల్ మొత్తం భాగం స్టే ఉన్నది అని అధికారులను తప్పు దారి పట్టించిన అక్రమార్కుడు. హైడ్రా విచారణలో ప్రభుత్వ భూమిలోకి వచ్చినట్టు నిర్ధారణ కావడంతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు ఫంక్షన్ హాల్ లోని కొంత భాగాన్ని, కాంపౌండ్ వాల్ ను కూల్చేసిన హైడ్రా అధికారులు. నాగిరెడ్డి కుంట నాలా బఫర్ జోన్‌లో నిర్మించినందుకు కూల్చివేతలు జరిపామన్న అధికారులు.

**తెలంగాణ ప్రజలు**

# మహాకుంభమేళాలో పాల్గొనండి

**హైదరాబాద్‌లో మహాకుంభ్ మేళా భారీ రోడ్‌షో**

**యూపీ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య**




**మహా, హైదరాబాద్:** మహాకుంభ్ 2025ని భారత సాంస్కృతిక ఐక్యతకు ప్రపంచ చిహ్నంగా మార్చాలని యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అనుకుంటోంది. ఇందులో భాగంగా ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య సారథ్యంలో హైదరాబాద్‌లో భారీ రోడ్‌షో జరిగింది. రోడ్‌షో అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ భారతదేశంలో భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శంగా నిలిచే ఓ అద్భుతమైన వేడుకగా 'మహాకుంభ్'ను అభివర్ణించారు. ప్రయాగ్‌రాజ్ మహాకుంభ్2025లో పాల్గొనాల్సిందిగా తెలంగాణ ప్రజలను ఈ సందర్భంగా ఆయన ఆహ్వానించారు. అంతర్జాతీయ భాగస్వామ్యం, అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఈ కార్యక్రమం చారిత్రాత్మకంగా నిలిచిపోయేందుకు ప్రభుత్వం గణనీయమైన చర్యలు చేపడుతోందని తెలిపారు. "ప్రపంచ వేదికపై భారత సాంస్కృతిక గర్వానికి చెరగని చిహ్నంగా నిలిచిన ప్రయాగ్‌రాజ్ మహా కుంభ్.. 2019లో అద్భుతమైన, గొప్ప అనుభవాన్ని అందిచడాన్ని మీలో చాలా మంది చూసి ఉండవచ్చు' అని విలేఖరుల సమావేశంలో ఉపముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఈ వేడుకను సమర్థంగా నిర్వహించిన విషయాన్ని ప్రపంచమంతా అంగీకరించింది కూడా అని అన్నారు. ఈ సంవత్సరం అంతకుమించి వైభవంగా మహాకుంభ్ వేడుక జరుగుతుందని ఆయన నొక్కి చెప్పారు. ప్రయాగ్‌రాజ్ మహాకుంభ్2025కు 45 కోట్ల మందికి పైగా యాత్రికులు, సాధువులు, సన్యాసులు, పర్యాటకులను ఆహ్వానించే అవకాశం ఉంది. ఇందుకోసమని సన్నాహక ఏర్పాట్లను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సకాలంలో పూర్తి చేసింది అన్నారు.

# నటుడికి వీఐపీ దర్శనం తప్పే

**ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డుపై ఆగ్రహం**

**సుమోటోగా తీసుకొని విచారించిన కేరళ హైకోర్టు**



**మహా, కేరళ:** శబరిమలలోని అయ్యప్ప క్షేత్రంలో నటుడికి వీఐపీ దర్శనం కల్పించడాన్ని కేరళ హైకోర్టు తప్పుబట్టింది. ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు(టీడీబీ) పై ఆగ్రహం వ్యక్తం చేసింది. మలయాళ నటుడు దిలీప్ గురువారం శబరిమలలోని అయ్యప్ప క్షేత్రాన్ని దర్శించుకున్నారు. టీడీబీ ఆయనకు వీఐపీ దర్శనం కల్పించింది. ఈ సమయంలో భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి చూడాల్సి వచ్చింది. కొందరు భక్తులు దేవుడిని దర్శించుకోకుండానే వెనుదిరిగారు. దీనిపై మీడియాలో వచ్చిన వార్తల ఆధారంగా కేరళ హైకోర్టు ఈ విషయాన్ని సుమోటోగా తీసుకొని విచారించింది.

చాలా సమయంపాటు నటుడు ఆలయంలో ఉండటానికి ఎలా అనుమతిచ్చారని టీడీబీని ప్రశ్నించింది. ఆయన వల్ల పిల్లలు, వృద్ధులు సహా ఇతర భక్తులు గంటల తరబడి లైన్లలో వేచి ఉండాల్సి వచ్చిందని పేర్కొంది. యాజమాన్యమే ఇలా ప్రవర్తిస్తే.. భక్తులు ఎవరికి ఫిర్యాదు చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేసింది.

# రంగంలోకి కేసీఆర్

**8న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కీలక భేటీ**

**తాజా రాజకీయ పరిణామాలపై కీలక నిర్దేశం**



**హైదరాబాద్ :** ఈ నెల 8వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంటకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సమావేశం కానున్నారు. ఈ సమావేశం ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో జరగనుంది. ఈ విషయాన్ని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. తెలంగాణ తల్లి రూపం మార్పు, అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో కేసీఆర్ భేటీ కీలక ప్రాధాన్యం సంతరించుకుంది.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సంపాదకీయం | EDITORIAL | శనివారం, హైదరాబాద్ | 07-12-2024

EDITORIAL ఎడిటోరియల్

# సరిహద్దులో శాంతికి మరో ముందడుగు

సరిహద్దులో శాంతి పవనాలు వీస్తున్నాయి. ఆందోళన తొలిగి పరిస్థితి కుదుటపడుతుందన్న భావన మొదలైంది. భారత్‌చైనా సరిహద్దులో శాంతికి మరో ముందడుగు పడింది. ఇరుదేశాల సరిహద్దులో శాంతియుత పరిస్థితులు కొనసాగేలా చూడటమే లక్ష్యంగా భారత్, చైనా దౌత్య చర్యలు జరిగాయి. ఇప్పటికే ఉన్న ద్వైపాక్షిక ఒప్పందాలకు అనుగుణంగా సరిహద్దు నియంత్రణ చర్యలు కొనసాగించాలని ఇరు దేశాలు తీర్మానించాయి. గల్వాన్ ఘర్షణల నేపథ్యంలో ఇటీవల కుదిరిన బలంగాల ఉపసంహరణ ఒప్పందం అమలుపై భారత్, చైనా ఏకాభిప్రాయం వ్యక్తం చేశాయి. ఢిల్లీలో జరిగిన చర్చల అనంతరం భారత విదేశాంగ శాఖ మేరకు వెల్లడించింది. 2020లో జరిగిన ఘర్షణలు, ఆ తర్వాత తలెత్తిన పరిణామాలపై భారత్, చైనా ప్రతినిధులు చర్చలు జరిపారు. ప్రస్తుతం ఇరు దేశాల సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులను సమీక్షించారు. సరిహద్దులో శాంతియుత పరిస్థితులు నెలకొల్పడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని తీర్మానించాయి. సరిహద్దు ప్రాంతాల్లోని పరిస్థితిని సమీక్షించడం, అవి పునరావృతం కాకుండా నిరోధించడానికి గత సంఘటనల నుంచి పాఠాలు నేర్చుకోవడంపై సమావేశం దృష్టి సారించింది. శాంతిని నిర్ధారించడానికి ఏర్పాటు చేసిన యంత్రాంగాల ద్వారా దౌత్య, సైనిక మార్పిడిని క్రమం తప్పకుండా నిర్వహించడం ప్రాముఖ్యతను రెండు పార్టీలు నొక్కిచెప్పాయి. భారత ప్రతినిధి బృందానికి విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో జాయింట్ సెక్రటరీ (తూర్పు ఆసియా) గౌరంగలాల్ దాస్ నాయకత్వం వహించగా.. చైనా ప్రతినిధి బృందానికి చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ సరిహద్దు, సముద్ర వ్యవహారాల విభాగం డైరెక్టర్ జనరల్ హాంగ్ లియాంగ్ నేతృత్వం వహించారు. ఈ తాజా రౌండ్ చర్చలు సరిహద్దు వెంట శాంతి, సహకారానికి, విస్తృత ఇండోచైనా సంబంధాలకు కొనసాగుతున్న నిబద్ధతను సూచిస్తున్నాయి. ఈ ప్రాంతంలో సుస్థిరతను నిర్ధారించేందుకు మరింత దౌత్య ప్రయత్నాలకు ఇరు దేశాలు కట్టుబడి ఉన్నాయి. ఇది మంచి ప్రయత్నం. తాజా ప్రయత్నంలో నిబద్ధత కనబడుతోంది. ఈ అడుగులతో సరిహద్దుల్లో శాంతి పరిఢవిల్లుతుందన్న భావన కలుగుతోంది.




# మళ్ళీ రైతుల ఢిల్లీ మార్చ్

రైతులు మళ్ళీ ఢిల్లీ బాట పట్టారు. గతంలో రైతు వ్యతిరేక చట్టాల ఆందోళన కేంద్రానికి ఎంత సవాల్‌గా మారిందో తెలిసిందే. దెబ్బకు ప్రధాని మోడీ కూడా దిగొచ్చి పార్లమెంట్ వేదికగా ఉపసంహరణ ప్రకటన చేశారు. ఇపుడు మళ్ళీ కనీస మద్దతు ధర డిమాండ్‌తో "ఛలో ఢిల్లీకి" పిలుపునిచ్చిన పంజాబ్ రైతులు ఆందోళనలను ఆదివారానికి వాయిదా వేశారు. శనివారం కేంద్రప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. "వారు చర్చలకు సిద్ధమని ప్రకటించారు. అందుకే శనివారం వరకు వేచి చూస్తాం. మేము చర్చలు జరగాలనే కోరుకుంటున్నాం. ప్రభుత్వంతో సంఘర్షణ జరగాలని అనుకోవడం లేదు. మేము శాంతియుతంగానే వ్యవహరిస్తాం" అని రైతు సంఘాల నాయకుడు శర్వణ్ సింగ్ పంధేర్ అన్నారు. పంటలకు కనీస మద్దతు ధర సహా 12 డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ శంభు సరిహద్దు ఉన్న రైతులు దిల్లీ ఛలోకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో గ్రేటర్ నోయిడాలో ఆందోళనలో పాల్గొంటున్న రైతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. తమ డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం నేరవేర్చాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు. నిరసన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు భారీగా రైతులు రావడం వల్ల గ్రేటర్ నోయిడాలో భారీ ట్రాఫిక్ జామ్ అయ్యింది. 100 మంది రైతుల బృందం శాంతియుతంగా ఢిల్లీ వైపు కవాతు చేస్తుందని శంభు సరిహద్దు వద్ద ఉన్న రైతు నాయకుడు సర్వన్ సింగ్ పంధేర్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న బారికేడ్లను బద్దలు కొట్టే ఉద్దేశం రైతులకు లేదని వెల్లడించారు. రైతులు ట్రాక్టర్లపై ఢిల్లీ వైపునకు వెళ్లడం వల్ల తమకు సమస్యగా ఉందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టుకు చెప్పాయని అన్నారు. అందుకే 100 మంది రైతుల బృందం శాంతియుతంగా ఢిల్లీ వైపు వెళుతుందని అన్నారు.

## నిరసనలకు అనుమతి

బారికేడ్లను బద్దలుకొట్టే ఉద్దేశం మాకు లేదు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు హరియాణా, పంజాబ్ ప్రభుత్వాలు తమకు అనుమతినిస్తాయని భావిస్తున్నాం. మాకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చడం లేదు. మేము కూడా భారతీయులమే. మరీ ముఖ్యంగా రైతులం. ప్రభుత్వం మమ్మల్ని ఎందుకు ఆపుతోంది? సరిహద్దుల వద్ద శాంతియుతంగా నిరసన తెలపడానికి ఎందుకు అనుమతించడం లేదు. కేంద్ర ప్రభుత్వం మా మాట వినడం లేదు. " అని పంధేర్ మండిపడ్డారు.

**రైతులకు అండగా**
## మోడీ సర్కార్

**వ్యవసాయ ఉత్పత్తులన్నింటినీ మోదీ సర్కార్ కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ శుక్రవారం రాజ్యసభలో తెలిపారు. వరి, గోధుమ, జొన్న, సోయాబీన్ పంటలను మూడేళ్ల క్రితం కంటే 50 శాతం ఎక్కువకు కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం ఇప్పటికే రైతులకు లాభసాటి ధరలను ఇస్తోందని వ్యాఖ్యానించారు. రైతు నిరసనల నేపథ్యంలో శివరాజ్ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది.**



**ప్రధాన డిమాండ్**
## ధరలే


పంటలకు కనీస మద్దతు ధరే తమ ప్రధాన డిమాండ్ అని రైతు నాయకురాలు సుఖ్వీందర్ కౌర్ వ్యాఖ్యానించారు. "మాకు 12 డిమాండ్లు ఉన్నాయి. అందులో ప్రధాన డిమాండ్ పంటలకు కనీస మద్దతు ధర. పంజాబ్ ప్రభుత్వం ఎంఎస్పీ అందిస్తుందని హామీ ఇచ్చింది. కానీ ఆ హామీ నెరవేర్చలేదు. పంజాబ్ సర్కార్తో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం. " అని కౌర్ తెలిపారు. ఢిల్లీలో రైతుల శాంతియుత నిరసనలకు కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించింది. అలాగే రైతులు కేంద్రానికి చేస్తున్న డిమాండ్లకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతునిస్తుందని ఆ పార్టీ అగ్రనేత జైరాం రమేశ్ ఎక్స్లో పోస్టు చేశారు. రైతుల నిరసనలకు ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్‌ఖడ్ వంటి వ్యక్తుల పరోక్ష మద్దతు లభించిందని అన్నారు. అది రైతులకు బూస్టర్ డోస్ అని పేర్కొన్నారు.ఇటీవల ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి ధన్ఖడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'రైతులకు కేంద్ర వ్యవసాయ మంత్రి ఏమి వాగ్దానం చేశారో దయచేసి నాకు చెప్పాలని అభ్యర్థిస్తున్నాను? ఎందుకు హామీలను నేరవేర్చలేదు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ఏం చేయాలి? గత ఏడాది రైతు ఉద్యమం జరిగింది. ఈ ఏడాది కూడా ఉద్యమం చేస్తున్నారు.' అని ధన్ఖడ్ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో ధన్ఖడ్ వ్యాఖ్యలను ఉదహరిస్తూ కాంగ్రెస్ కేంద్ర సర్కార్పై విమర్శలు గుప్పించింది.

# మీ కంట్రోల్‌లోనే ఉన్నారా?

**ఈ స్మార్ట్ యుగంలో మీరు మీ కంట్రోల్‌లో ఉన్నారని భావిస్తున్నారా! మీరు భ్రమల్లో పరిభ్రమిస్తున్నట్టే!! డిజిటల్ దునియాలో ట్రెండింగ్ ఐటమ్ ఏంటో తెలుసా? మీరే!! కృత్రిమ మేధ వికృత క్రీడలో మీరో సేల్ ప్రొడక్ట్! ఇక్కడ ఇంకో ట్విస్ట్ ఉంది. మిమ్మల్ని అమ్మేసిన విషయం మీక్కూడా తెలియదు! ఇటీవల విడుదలైన 'CTRL' సినిమా ఈ విషయాన్ని క్లియర్‌గా చూపించింది. క్షణాల్లో మన పనులు చక్కబెడుతున్న ఏఐ మిమ్మల్ని రింగ్ మాస్టార్‌లా ఆడిస్తుందన్నది నిజం. కావాలంటే చెక్ చేసుకోండి..**

గూగుల్ మీ ఆసక్తులకు తగ్గ వస్తువులకు సంబంధించిన నోటిఫికేషన్లు పంపిస్తుంది కదా! ఎప్పుడో ఏడాది కిందట దిగిన ఫొటోలు.. మళ్లీ రీక్యాప్ చేస్తుంది కదా! ఈ ఉదాహరణలు చాలు అరచేతిలో ఒదిగిపోయిన ఫోన్‌లో మీ జీవితమంతా ఇమిడిపోయిందని చెప్పడానికి. 'గోడలకు చెవులుంటాయ్' పాత సామెత! కానీ, ఇప్పుడు జేబులో ఉన్న ఫోనో.. ఒడిలో ఉన్న ల్యాపీనో వింటుందేమోనని సందేహించాల్సిందే! మైక్రోఫోన్, బిల్ట్‌ఇన్ కెమెరా.. ఈ రెండూ దేంట్లో ఉన్నా పరేషానే! ఇవి వాటంతట అవి మీ జీవితంలోకి ప్రవేశించవు. అవగాహనా రాహిత్యంతో మీరిచ్చే పర్మిషన్లు వాటిని యాక్టివేట్ చేస్తాయి. మనం పడుకున్నప్పుడు కూడా అవి మనల్ని గమనిస్తూ ఉంటాయి. మన మాటలు వింటుంటాయి. మన ఇన్‌బాక్స్‌లో మెసేజ్‌లను చదివేస్తాయి. మన టైమ్ బాగోకపోతే.. 'కంట్రోల్' సినిమాలో లాగా మనకు తెలియకుండానే మెసేజ్‌లకు రిప్లైలు కూడా ఇచ్చేస్తుంటాయి.
మన కమాండ్‌తో పనిచేసే గ్యాడ్జెట్ కేవలం యంత్రం అనుకుంటే పొరపాటే! ఏదైనా యాప్ ఇన్‌స్టాల్ చేసినప్పుడు ఏం ఆలోచించకుండా పర్మిషన్స్ ఇచ్చేస్తుంటాం. విశేష అనుమతులు పొందిన ఏఐని ఆసరాగా చేసుకొని హ్యాకర్లు రకరకాల విన్యాసాలకు పాల్పడుతుంటారు. మీ ముఖాన్ని ఫేక్ చేయొచ్చు, మీ మాటల్ని వింటూ కరెక్ట్‌గా మిమిక్రీ చేయొచ్చు! ఈ రెండూ ఫేక్ చేయగలితే మీ పరిస్థితి 'కంట్రోల్' సినిమాలో కథానాయికలా మారిపోతుంది.

దీనికి విరుగుడు డిజిటల్ డిటాక్షన్ మాత్రమే! స్మార్ట్‌ఫోన్ వినియోగాన్ని ఎంత తగ్గించుకుంటే మీరు అంత సేఫ్‌గా ఉన్నట్టు. యాప్‌లు ఇన్‌స్టాల్ చేసేటప్పుడు, వెబ్ సర్వీస్‌లు వినియోగించే ముందు టర్మ్స్ అండ్ కండీషన్స్ ఓపికగా చదవాలి! ఆ ఏం చదువుతాంలే అని ఓకే.. ఓకే.. అనుకుంటూ వెళ్లిపోతే, అసలుకే ఎసరొస్తుంది. సదరు యాప్‌లు, వెబ్ సర్వీస్‌లు బ్యాక్‌గ్రౌండ్‌లో రన్ అవుతూ మిమ్మల్ని వాటి కంట్రోల్‌లోకి తీసుకుంటాయి. అలా జరగొద్దంటే.. ఒక యాప్ ఇన్‌స్టాల్ చేసే క్రమంలో 'ఓకే' అనేముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి. చుట్టూ ఉన్న ప్రపంచాన్ని కాదని సామాజిక మాధ్యమాల్లో దుమ్మురేపాలన్న ఆలోచన ధోరణిని తగ్గించుకోవాలి. ఏఐ విప్లవాత్మకంగా విస్తరిస్తున్న తరుణంలో ఫోన్‌ను ఎడాపెడా వాడేసే సంస్కృతిని తగ్గించుకోవాలి. డిజిటల్ అక్షరాస్యత తప్పనిసరి. సమస్య ఏదైనా కుటుంబసభ్యులతో పంచుకోవాలి. లేదంటే.. 'కంట్రోల్' సినిమాలోని కథానాయికలా వర్చువల్ వరల్డ్‌కు సరెండర్ అవ్వాల్సి వస్తుందని గుర్తుంచుకోండి.



# చలికాలంలో తులసీ ఆకుల ప్రయోజనాలు



చలికాలంలో సీజనల్ వ్యాధులు వస్తుంటాయి. అందులో జలుబు, దగ్గ, చర్మ సమస్యలు ఎక్కువగా వస్తుంటాయి. చిన్న పిల్లల విషయంలో ఈ సమస్య చాలా ఎక్కువగా ఉంటుంది. దీంతో వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతూ పలు జాగ్రత్తలు తీసుకుంటుంటారు. ముఖ్యంగా ఆహారం విషయంలో కీలకంగా వ్యవహరిస్తుంటారు. ఎటువంటి ఆహారం తీసుకోవాలి..? ఏ విధంగా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలనే విషయాలను తెలుసుకుంటున్నారు. ఈ క్రమంలో వైద్య నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు. వింటర్ లో సీజనల్ వ్యాధులు రావడం కామన్. చిన్న పిల్లలు, వృద్ధులు వాటి బారిన ఎక్కువగా పడుతుంటారు. ఈ నేపథ్యంలో వీరు ఎక్కువగా అలర్ట్ గా ఉండాల్సిన అవసరం ఉంది. అయితే, ఫుడ్ విషయంలో జాగ్రత్తలు తీసుకుంటూ ఉండాలి. శక్తినిచ్చే ఆహారం తీసుకుంటూ ఉండాలి. ముఖ్యంగా తులసీ ఆకును చలికాలంలో ఆహారంలో భాగం చేసుకోవాలి. ప్రతిరోజూ తులసీ ఆకులను తీసుకుంటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. వాటిలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ తదితర లక్షణాలు అధికంగా ఉంటాయి. దీంతో తులసీ ఆకులు శారీరక సమస్యలను దరిచేరనియ్యవు. గుండెపోటును కంట్రోల్ చేసి, గుండెపోటు లాంటి సమస్యలు దరిచేరకుండా చేస్తాయి. చర్మ సమస్యలు రాకుండా కాపాడుతుంది. జీర్ణక్రియ ఎప్పుడూ ఆరోగ్యంగా ఉంటుంది. వీటితోపాటు నోటి దుర్వాసన, నోటి సమస్యల కూడా రావు. తులసీ ఆకులో ఉండే గుణాలు నోట్లోని బ్యాక్టీరియాను చంపి నోటి దుర్వాసన లేకుండా చేస్తాయి. ఇలా ప్రతిరోజూ నాలుగు తులసి ఆకులు తినడం వల్ల ఔషద గుణాలు కలిగిన తులసీ ఆకులు అన్ని రోగాలకు చెక్ పెడుతాయి.

## రచనలకు ఆహ్వానం


ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
editor@mahaadaily.com | whatsapp- 7436939999




## బెంగళూరులో భార్య హత్య..
# బీహార్‌లో భర్త అరెస్ట్

**బెంగళూరు:** కర్ణాటక రాజధాని బెంగళూరులో నివసించిన ఒక వ్యక్తి తన భార్యను హత్య చేశాడు. మృతదేహాన్ని కాలువలో పడేశాడు. ఆరుగురు పిల్లలతో కలిసి సొంత రాష్ట్రానికి పారిపోయాడు. దర్యాప్తు చేసిన పోలీసులు బీహార్‌లో ఉన్న ఆ వ్యక్తిని అరెస్ట్ చేశారు. పెయింటర్‌గా పని చేస్తున్న 39 ఏళ్ల మహ్మద్ నాసిమ్ రెండో భార్య అయిన 22 ఏళ్ల రుమేష్ ఖాతున్‌తో కలిసి బెంగళూరులోని సర్జాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాంతంలో నివసించాడు. గొడవలు, అనుమానంతో నవంబర్ 11న గొంతునొక్కి భార్యను హత్య చేశాడు. కాళ్లు, చేతులను తాళ్లతో కట్టేశాడు. నగర శివారులోని కాలువలో మృతదేహాన్ని పడేశాడు. తన ద్వారా పుట్టిన ఇద్దరు పిల్లలు, భార్య మొదటి భర్త ద్వారా పుట్టిన నలుగురు పిల్లలతో కలిసి అక్కడి నుంచి పారిపోయాడు. కాగా, కాలువ నుంచి దుర్వాసన రావడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసులు మహిళ మృతదేహాన్ని గమనించి బయటకు తీయించారు. పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ మహిళను రుమేష్ ఖాతున్‌గా గుర్తించారు. మరోవైపు ఆ మహిళ భర్త మహ్మద్ నాసిమ్ అదృశ్యమైనట్లు పోలీసులు తెలుసుకున్నారు. అతడి మొబైల్ ఫోన్ ట్రాక్ చేశారు. బీహార్‌లోని ముజఫర్‌పూర్‌లో నిందితుడు ఉన్నట్లు గుర్తించారు. బెంగళూరు పోలీసులు అక్కడకు వెళ్లారు. అప్పటికే మూడో పెళ్లి చేసుకున్న మహ్మద్ నాసిమ్‌ను అరెస్ట్ చేసి బెంగళూరుకు తీసుకువచ్చారు. అతడి రెండో భార్య హత్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సివిల్ సర్వీస్ అభ్యర్థుల నిరసన..
# పోలీసులు లాఠీచార్జ్



**పాట్నా:** సివిల్ సర్వీస్ అభ్యర్థులు నిరసన చేపట్టారు. కంబైన్డ్ ప్రిలిమినరీ పరీక్ష సాధారణీకరణను వ్యతిరేకించారు. ఈ పరీక్షలో మార్పులు చేయవద్దని, పాతపద్ధతిలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు లాఠీచార్జ్ చేశారు. (Police Lathi Charge) బీహార్ రాజధాని పాట్నాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం సివిల్ సర్వీస్ అభ్యర్థులు నిరసనకు దిగారు. బెయిలీ రోడ్‌లోని బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బీపీఎస్సీ) ఎదుట ఆందోళన చేపట్టారు. 70వ కంబైన్డ్ ప్రిలిమినరీ పరీక్షను నార్మలైజ్ చేస్తున్నట్లుగా వస్తున్న వార్తలపై ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో మాదిరిగానే పరీక్షా విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు లాఠీచార్జ్ చేశారు. నిరసనకు దిగిన సివిల్ సర్వీస్ ఔత్సాహిక అభ్యర్థులను చెదరగొట్టారు. మరోవైపు బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బీపీఎస్సీ) దీనిపై స్పందించింది. నార్మలైజేషన్ కోసం కమిషన్ ఎలాంటి ప్రణాళిక ప్రకటించలేదని కార్యదర్శి స్పష్టం చేశారు. దీని గురించి వస్తున్న పుకార్లను కొట్టిపారేశారు. అభ్యర్థులు ఆందోళన వీడి ప్రిపరేషన్‌పై దృష్టిసారించాలని సూచించారు.

## కొడనాడు కేసులో
# మద్రాస్ హైకోర్టు కీలక ఆదేశాలు..!



ఏడేళ్ల క్రితం దేశవ్యాప్తంగా సంచలనం రేపిన కొడనాడు హత్య, దోపిడీ కేసులో మద్రాస్ హైకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. ఈ కేసుకు సంబంధించి ప్రతిపక్ష ఏఐఏడీఎంకే నేత ఎడప్పాడి పళనిస్వామి, శశికళ తదితరులను విచారించేందుకు సీబీసీఐడీ పోలీసులకు అనుమతినిచ్చింది. వారిద్దరినీ విచారించకుండా ఊటీలోని జిల్లా కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను కోర్టు కొట్టివేసింది. కొడనాడు ఎస్టేట్‌లో 2017లో పోలీసులు దాదాపు ఐదేళ్లపాటు దర్యాప్తు జరిపినా ఎలాంటి ఫలితం కనిపించలేదు. ప్రభుత్వం మారిన తర్వాత కేసును సీఐడీకి అప్పగించారు. ఈ కేసులో ఇప్పటివరకు 10 మందిని అరెస్టు చేశారు. సుమారుగా 100 మందిని విచారించారు. అయితే కేసులో పళనిస్వామి, శశికళను విచారించేందుకు గతంలో దిగువ కోర్టు అనుమతి ఇవ్వలేదు.

దాంతో వారిని కూడా విచారించేందుకు అనుమతి ఇవ్వాలని సీబీసీఐడీ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తాజాగా దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఆ ఇద్దరి విచారణకు అనుమతిస్తూ ఆదేశాలు జారీచేసింది. అంతేకాకుండా ఎస్టేట్‌లో కనిపించకుండా పోయిన కొన్ని విలువైన వస్తువుల గురించి శశికళ, ఇళవరసిని ప్రశ్నించాలని ఆర్డర్ వేసింది. కాగా, 2017లో తమిళనా మాజీ ముఖ్యమంత్రి జయలలితకు చెందిన కొడనాడు ఎస్టేట్‌లో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి కాపలాదారుడు ఓం బహదూర్‌ను హత్యచేశారు. ఎస్టేట్‌లోని పలు వస్తువులన దోచుకెళ్లారు.



# భారతీయులకు థాయ్‌లాండ్ గుడ్‌న్యూస్..!
## పర్యాటకులకు మరికొద్దిరోజులు వీసా ఫ్రీ ఎంట్రీ..!

భారతీయ పర్యాటకులకు థాయ్‌లాండ్ శుభవార్త చెప్పింది. ఆ దేశంలో పర్యాటక రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు కీలక నిర్ణయాన్ని తీసుకున్నది. ప్రభుత్వం వీసా ఫ్రీ ఎంట్రీ గడువును పొడిగించింది. భారతీయులకు మాత్రమే వీసా ఫ్రీ ఎంట్రీ పాలసీని నిరవధికంగా పొడిగించింది. గతంలో నవంబర్ 11 వరకు వీసా ఫ్రీ ఎంట్రీ గడువు ఇచ్చింది. ప్రస్తుతం మరో రెండునెలలు పొడిగించింది. దాంతో మరో రెండునెలల పాటు థాయ్‌లాండ్‌లోనే వీసా లేకుండా ఉండొచ్చు. టూరిజం అథారిటీ ఆఫ్ థాయ్‌లాండ్ జారీ చేసిన అడ్వైజరీ ప్రకారం.. భారతీయ పౌరులు వీసా లేకుండా 60 రోజుల పాటు థాయ్‌లాండ్‌లో ఉండవచ్చని పేర్కొంది. భారతీయ పౌరులు ఇంతకంటే ఎక్కువ సమయం ఉండాలనుకుంటే ఇమ్మిగ్రేషన్ కార్యాలయానికి వెళ్లి మరో 30 రోజుల గడువును పొడిగించు కోవచ్చని పేర్కొంది. ఇక థాయ్‌లాండ్‌లో ప్రముఖ బీచ్‌లు ఉన్నాయి. ఫై ఫై ఐలాండ్, ఫుకెట్, క్రాబీ, కోరల్ ఐలాండ్, పట్టాయా బీచ్‌లకు ప్రసిద్ధి. ఈ బీచ్‌లలో ఎంజాయ్ చేయొచ్చు. ప్రతి సంవత్సరం ప్రపంచం నలుమూలల నుంచి లక్షలాది మంది పర్యాటకులు ఈ బీచ్‌లకు వస్తుంటారు. అదే సమయంలో సన్‌సెట్ సైతం అద్భుతంగా ఉంటుంది. థాయ్‌లాండ్ బీచ్‌లతో పాటు చారిత్రక ఆలయాలు సైతం ఉన్నాయి. వాస్తు నిర్మాణాలకు ప్రసిద్ధి చెందిన అనేక దేవాలయాలు ఉన్నాయి. ఇందులో పట్టాయాలో ఉన్న 'సెంచరీ ఆఫ్ ట్రూత్', 'అయుతయ', 'వైట్ టెంపుల్', 'ది గ్రాండ్ ప్లేస్' ఉన్నాయి.

## భారీ జెయింట్ వీల్‌పై వేలాడిన బాలిక..
# తర్వాత ఏం జరిగిందంటే?



**లక్నో:** పెద్ద జెయింట్ వీల్ ఎక్కిన బాలిక భారీ కుదుపునకు అదుపుతప్పింది. కూర్చొన్న సీటు నుంచి జారిపడింది. అదృష్టవశాత్తు జాయ్‌రైడ్ రాడ్‌ను ఆమె పట్టుకున్నది. భయంతో అరుస్తూ 60 అడుగుల ఎత్తులో ప్రమాదకరంగా వేలాడింది. (Girl Screams Dangling) ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. రాకేహ్రా గ్రామంలో తిరునాళ్లు జరిగాయి. ఈ సందర్భంగా ఫెర్రిస్ వీల్ ఏర్పాటు చేశారు. కాగా, 13 ఏళ్ల బాలిక ఆ భారీ జెయింట్ వీల్ ఎక్కింది. రైడ్ తర్వాత అది ఆగడంతో ఊహించని కుదుపునకు ఆ బాలిక బ్యాలెన్స్ తప్పింది. కూర్చొన్న సీటు నుంచి జారిపడింది. అయితే అదృష్టవశాత్తు జాయ్‌రైడ్ రాడ్‌ను ఆమె పట్టుకున్నది. భయంతో అరుస్తూ 60 అడుగుల ఎత్తు నుంచి ప్రమాదకరంగా వేలాడింది.

మరోవైపు ఆ జెయింట్ వీల్‌ను మెల్లగా తిప్పి కిందకు చేర్చారు. దీంతో ఆ బాలిక సురక్షితంగా కిందకు దిగింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనిపై అధికారులు స్పందించారు. ఆ బాలికకు ఎలాంటి ప్రమాదం జరుగలేదని తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా భారీ జెయింట్ వీల్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## స్కూల్ ప్రిన్సిపాల్‌ను కాల్చి చంపిన విద్యార్థి..
# ఆయన బైక్‌పై పరార్



**భోపాల్:** స్కూల్ ప్రిన్సిపాల్‌ను ఒక విద్యార్థి కాల్చి చంపాడు. (Student Shoots Principal Dead) ఆ తర్వాత మరో విద్యార్థితో కలిసి ఆయన బైక్‌పై పారిపోయాడు. కాల్పుల శబ్దానికి స్కూల్‌లోని టీచర్లు, స్టూడెంట్లు భయాందోళన చెందారు. మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ధమోరా ప్రభుత్వ హయ్యర్ సెకండరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడైన 55 ఏళ్ల సురేంద్ర కుమార్ సక్సేనా సుమారు ఐదేళ్లుగా ఆ స్కూల్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. శుక్రవారం స్కూల్‌లోని టాయిలెట్‌కు వెళ్తున్న ఆయనను 12వ తరగతి విద్యార్థి ఫాలో అయ్యాడు. ప్రిన్సిపాల్ తలపై గన్‌తో కాల్పులు జరిపాడు. ఆ తర్వాత మరో విద్యార్థితో కలిసి సురేంద్ర కుమార్ సక్సేనా బైక్‌పై అక్కడి నుంచి పారిపోయాడు. కాగా, కాల్పుల శబ్దానికి స్కూల్‌లోని టీచర్లు, స్టూడెంట్స్ భయాందోళన చెందారు. రక్తం మడుగుల్లో పడి ప్రిన్సిపాల్ మరణించడాన్ని చూశారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ స్కూల్‌కు చేరుకున్నారు. సురేంద్ర కుమార్ సక్సేనా మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మరోవైపు ఆ స్కూల్‌లోని సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలించారు. ప్రిన్సిపాల్‌పై కాల్పుల తర్వాత మరో విద్యార్థితో కలిసి ఆ స్టూడెంట్ పారిపోవడాన్ని గమనించారు. క్రమశిక్షణా రాహిత్య చరిత్ర ఉన్న ఆ ఇద్దరు విద్యార్థులు ధిలాపూర్ గ్రామానికి చెందిన వారుగా గుర్తించినట్లు పోలీస్ అధికారి తెలిపారు. వారిని అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# ఇండియన్ నేవీలోకి ఐఎన్ఎస్ తుషిల్ యుద్ధనౌక.. రష్యాలో జల ప్రవేశం

**కాలినిన్‌గ్రాడ్:** భారతీయ నౌకాదళంలోకి కొత్త యుద్ధ నౌక వస్తోంది. ఐఎన్ఎస్ తుషిల్ (INS Tushil) డిసెంబర్ 9న నేవీలో కలవనున్నది. రష్యాలోని కాలినిన్‌గ్రాడ్‌లో ఆ నౌకను జలప్రవేశం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొంటున్నారు. క్రివాక్3 క్లాస్ ఫ్రిగేట్‌కు చెందిన అప్‌గ్రేడ్ వర్షన్ ఐఎన్ఎస్ తుషిల్. 1135.6 ప్రాజెక్టులో భాగంగా ఈ యుద్ధనౌకలను తయారు చేస్తున్నారు. ఇప్పటికే ఇలాంటి ఆరు నౌకలు సర్వీసులో ఉన్నాయి. మూడు తల్వార్ క్లాసు, మరో మూడు టెగ్ క్లాసు షిప్‌లు ఉన్నాయి. తల్వార్ క్లాసు నౌకలను సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని బాల్టిస్కీ షిప్‌యార్డులో, మిగితా మూడు కాలినిన్‌గ్రాడ్‌లోని యాంటర్ షిప్‌యార్డులో తయారు చేశారు. అయితే ఇదే సిరీస్‌కు చెందిన ఏడవ యుద్ధ నౌక ఐఎన్ఎస్ తులసి. ఈ యుద్ధ నౌక తయారీ కోసం 2016లో రోసోబోరన్ ఎక్స్‌పోర్ట్, ఇండియన్ నేవీ, భారత ప్రభుత్వం మధ్య ఒప్పందం జరిగింది.



# టైర్ పేలి కారు బోల్తా.. ముగ్గురు మృతి, ఇద్దరికి గాయాలు

**రాయ్‌పూర్:** జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న కారు ముందు టైరు పేలింది. (Car Tyre Bursts) దీంతో అది బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఛత్తీస్‌గఢ్‌లోని సూరజ్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం ఉదయం పెళ్లి వేడుకకు హాజరైన కొందరు మనేంద్రగఢ్ నుంచి అంబికాపూర్‌కు కారులో వెళ్తున్నారు. జాతీయ రహదారి 43లోని చంద్రపూర్ గ్రామ సమీపంలో వేగంగా వెళ్తున్న ఎస్‌యూవీ ముందు టైర్ పేలింది. దీంతో ఆ కారు బోల్తాపడింది. కాగా, ఆ కారులో ప్రయాణించిన ఐదుగురిలో ముగ్గురు మరణించారు. మరో ఇద్దరు గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారు. మృతులను ఒడిశాలోని ఝుర్సుగూడకు చెందిన ఆనంద్ చౌదరి (28), అంబికాపూర్‌కు చెందిన రీటా చౌదరి (46), కోర్బాకు చెందిన పుష్పా మాంఝీ (40)గా గుర్తించారు.

మరోవైపు ఈ ప్రమాదంలో అజయ్ నాథ్ చౌదరి (38), అతడి కుమారుడు అనికేత్ (10) తీవ్రంగా గాయపడ్డారు. వారిని సూరజ్‌పూర్‌లోని ఆసుపత్రికి తొలుత తరలించారు. మెరుగైన చికిత్స కోసం అంబికాపూర్‌లోని మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



# రాజ్యాంగ రక్షణే బాబాసాహెబ్‌కు నిజమైన నివాళి



**ఆదిలాబాద్ మహా :** రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 68 వ వర్ధంతి ని బోథ్ లో ఘనంగా నిర్వహించారు. మండల అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు కంది ప్రవీణ్ మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ తన జీవితాన్ని, తన కుటుంబాన్ని, త్యాగం చేసి రాజ్యాంగ రచన కోసం అహర్నిశలు కష్టపడి ఈ దేశానికి రాజ్యాంగాన్ని అందించారన్నారు. కానీ నేడు కొన్ని విద్రోహ శక్తులు రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు చేస్తున్నాయని, కానీ దేశ అభివృద్ధికి దిక్సూచి అయిన రాజ్యాంగ రక్షణే మనం ఆ మహనీయునికి ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి , ప్రధాన కార్యదర్శి రమేష్ బత్తుల,చంటి పసుల , బోథ్ మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్,మాజీ వైస్ ఎంపీపీ లింభాజీ, బోథ్ మండల మాల సంఘం అధ్యక్షులు ఎల్క రాజు, రమేష్, శేఖర్, లింగం పెళ్ళి సంతోష్, ప్రభాకర్, రవి, మహేందర్, మల్లేష్, ఊసన్న, సురేందర్, లక్ష్మణ్,భోజన్న, ముత్యం,కిరణ్, తదితరులు పాల్గొన్నారు

# యాదవ మహాసభ జిల్లా అధ్యక్షునిగా మాదం సాగర్



**ములుగు, మహా:** తెలంగాణ యాదవ మహాసభ ములుగు జిల్లా అధ్యక్షునిగా మాదం సాగర్ యాదవ్ ఏకగ్రీవంగ్ ఎన్నికయ్యారు. సంఘం రాష్ట కార్యదర్శి కోరె రవి ఆధ్వర్యంలో శుక్రవారం ములుగులో జరిగిన సమావేశంలో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నర్రావుల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గాదం కుమార్, ఉపాధ్యక్షులుగా మర్రి గట్టయ్య, వేల్పుల బుచ్చయ్య, కార్య దర్శిగా బక్క రాజ్ కుమార్, కోశాధికారిగా బాలుగు ఐలయ్య, సహాయ కార్యదర్శిగాభాషబోయిన మాలగం, కార్యవర్గ సభ్యులుగా నర్రావుల ప్రసాద్, భూషబోయిన రమేష్, అప్పుల వెంకన్న, వంగ కొమురయ్య, ములుగు మండల అధ్యక్షుడిగా గొర్రె శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడిగా బైకాని విష్ణు, వెంకటాపూర్ మండల అధ్యక్షుడిగా కాయిత రవి, ప్రధాన కార్యదర్శిగా సంపత్ లు ఎన్నికయ్యారు. యాదవులు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి సాధించేలా కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేషబోయిన సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.




# ఇందిరమ్మ రాజ్యంలో ఈ అరెస్టులేంటి..?

## ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ రమణయ్య

**ములుగు, మహా:** కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం రావాలంటూ ప్రతిపక్ష నాయకులను అక్రమ అరెస్టులు చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకుడు, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ దుర్గం రమణయ్య విమర్శించారు. శుక్రవారం ములుగు పోలీసులు రమణయ్యతోపాటు పోరిక గోవింద్ నాయక్, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు పోరిక విజయ్ రామ్ నాయక్, బీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కోగిల మహేష్, మాజీ ఎంపీటీసీ గొర్రె సమ్మయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ బైకాని సాగర్, మాజీ సర్పంచులు సానికొమ్ము శిరీష అదిరెడ్డి, ముడుతనపెల్లి మోహన్, మాజీ ఉప సర్పంచ్ కొమురా రెడ్డి, నాయకులు మాదం సాగర్, బుల్లెట్ ఓదెలులను అదుపులోకి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిలను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదని ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని ఆరోపించారు.

# సిద్ధుల కుంటలో ఘనంగా అయ్యప్ప పడిపూజ



**నిర్మల్ మహా :** నిర్మల్ జిల్లా సోన్ మండలం సిద్దుల కుంట గ్రామంలోని సిద్దేశ్వర ఆలయ ప్రాంగణం అయ్యప్ప స్వామి నామస్మరణతో మారుమోగింది. వేద పండితులు చక్రవర్తుల తేజ ఆచార్యుల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ కన్నుల పండువగ నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి సుబ్రహ్మణ్య స్వామి అయ్యప్ప స్వామి విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు చేపట్టారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి పదునెట్టాంబడి వెలిగించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు చెనిగారపు చిన్నయ్య, జనార్ధన్, భోజ రెడ్డి, శంకర్, శ్రీనివాస్ స్వామి, సిద్దులకుంట అయ్యప్ప సేవా సమితి సభ్యులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కలెక్టర్ పై వ్యక్తిగత దూషణలు సహించేదిలేదు

## ఉద్యోగల సంఘాల హెచ్చరిక

**ములుగు, మహా:** జిల్లా ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం పరిపాలన కొనసాగించే కలెక్టర్ పై వ్యక్తిగత దూషణలు చేయడాన్ని సహించేందిలేదని జిల్లాలోని వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు హెచ్చరించారు. శుక్రవారం ములుగు జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఓ పత్రికలో కలెక్టర్ ను వ్యక్తిగతంగా దషిస్తూ రాసినందుకు స్పందిస్తూ నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆర్. రామకృష్ణ, టీఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షుడు కుమారస్వామి, జిల్లా ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్ పతి, టీజీటీఏ అధ్యక్షుడు రాజ్ కుమార్, టీఆర్ఈఎస్ఏ అధ్యక్షుడు పి.ప్రసాద్ లు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పాత్రికేయ వృత్తిపై అపారమైన గౌరవం ఉందని, ఆ గౌరవాన్ని కాపాడుకునేలా కొందరు వ్యవహరించకపోవడం దురదృష్టకరమన్నారు. జిల్లా మెజిస్ట్రేట్ ను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం సహించరానిదన్నారు. వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవిపేట శివారులోని 359సర్వే నెంబర్ లో ఉన్న భూమి సమస్య పరిష్కారం కోసం కలెక్టర్ దివాకర మూడు రోజులపాటు గ్రామసభలు నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారని పేర్కొన్నారు. అయితే నిరాధార వార్తలు ప్రచురించడంతోపాటు అసభ్యకరమైన పదజాలాన్ని ప్రచురించడంపట్ల ఉద్యోగ సంఘాల నాయకులందరూ ఖండిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.



# అంబేద్కర్ మహనీయునికి ఘన నివాళులు

**నిర్మల్ మహా:** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 68 వ వర్ధంతిని నిర్మల్ మున్సిపల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. స్థానిక ధర్మసాగర్ మినీ ట్యాంక్ బండ్ పై గల మహనీయుని విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ దళిత సంఘ నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అసమానతలు లేని సమాజం కోసం అనునిత్యం పరితపించిన మహానేత అంబేద్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ అరెస్టులతో కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు

**మంగపేట, డిసెంబర్ 06, మహా:** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని మంగపేట బీఆర్ఎస్ నేతలు అన్నారు. అందులో భాగంగానే మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు, పాడి కౌశిక్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తూ, శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు ఆందోళనలకు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో పోలీసులు ముందస్తుగా పార్టీ కార్యకర్తలను, నాయకులను అరెస్టు చేయడం సమంజసం కాదని కమలాపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు పప్పు వెంకట్ రెడ్డి, బీఆర్టీయూ ములుగు జిల్లా అధ్యక్షులు ఎస్కే కుర్బాన్ ఆలీ, ప్యాక్స్ డైరెక్టర్ సిద్ధం శెట్టి లక్ష్మణ్ రావులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజలకిచ్చిన హామీలను తుంగలో తొక్కిందని, అమలు చేసే సత్తా లేక ప్రశ్నించే వారిపై హౌస్ అరెస్టులు, అక్రమ అరెస్టులు చేస్తున్నారన్నారు. ఇలాంటి అక్రమ అరెస్టులకు, గృహ నిర్బంధాలకు బీఆర్ఎస్ నాయకులు అదిరేదిలేదు, బెదిరేదిలేదన్నారు. తమకు పోరాటాలు,



ఉద్యమాలు, కేసులు, అరెస్టులు కొత్త కావని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మంగపేట మండలం ఆర్గనైజింగ్ సెక్రటరీ చల్లగురుగుల తిరుపతి, పార్టీ సీనియర్ నాయకులు ఈదునూరి రవీందర్, మండల సంయుక్త కార్యదర్శి చీకుర్తి సుధాకర్, గుడిసేవ నాగేశ్వరావు, పాలమాకుల సోమ నర్సయ్య, గ్రామ ఎస్సీ సెల్ కమిటీ ఉపాధ్యక్షుడు గంగెర్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి జాడి రవి, గణేష్, గ్రామ సోషల్ మీడియా ఇన్ చార్జి బీస్ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది

**మంగపేట, డిసెంబర్ 06, మహా:** కాంగ్రెస్ కార్యకర్తలకు పార్టీ అండంగా ఉంటుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరాం రెడ్డి అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏకాంతం కుటుంబ సభ్యులను పరామర్శించి, కొంత నగదును వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరాం రెడ్డి, ములుగు జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టిపల్లి వెంకటేశ్వర్లు, హ్యూమన్ రైట్స్ చైర్మన్ బండ్ల జగన్ మోహన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మాసిరెడ్డి వెంకట్రెడ్డి, సీనియర్ నాయకులు పగిడిపల్లి వెంకటేశ్వర్లు, ఎంపెల్లి వీరస్వామి, బాసరికారి హరికృష్ణ, కొండల్ రెడ్డి, రాచకొండ సోమయ్య, మండల యూత్ గౌరవ అధ్యక్షులు జంగం భానుచందర్, పల్లె శోభన్ బాబు, యుగంధర్ రెడ్డి, నక్క శీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచంలోనే గొప్పది భారతదేశ రాజ్యాంగం- కలెక్టర్

## ఆదిలాబాద్‌లో ఘనంగా అంబేద్కర్ వర్ధంతి వేడుకలు

**ఆదిలాబాద్ మహా :** ఒక గొప్ప ఆలోచనతో అందరికీ సమాన హక్కులు కల్పిస్తూ రూపొందించిన భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకే ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. భారతరత్న, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ వర్ధంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని స్థానిక అంబేద్కర్ చౌక్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఎస్పీ గౌస్ ఆలం, ఎమ్మెల్యేతో కలిసి ఆయన హాజరయ్యారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళ్లర్పించారు. ఆయన దేశానికి అందించిన సేవలను కొనియాడారు. భారతదేశ రాజ్యాంగం ఎంతో గొప్పదని, అన్ని మతాలు, కులాలు, అన్నివర్గాలకు దిశా నిర్దేశం చేస్తూ రూపొందించబడిందన్నారు. అందరికీ సమాన హక్కులు ఉండాలనే ఆలోచనతో దేశానికి ఈ రాజ్యాంగాన్ని అందించారన్నారు. 75 సంవత్సరాలుగా ఈ రాజ్యాంగం అమలవుతోందని అన్నారు. ఈ రాజ్యాంగాన్ని ఒక గొప్పగ్రంథంగా పరిగణిస్తూ ప్రతిఒక్కరూ తమ నిత్య జీవితంలో రాజ్యాంగానికి కట్టుబడి నడుచుకోవాలని సూచించారు. రాజ్యాంగ సూత్రాలను అనుసరించి ముందుకు సాగాలని దిశా నిర్దేశం చేశారు. అదేవిధంగా



అంబేద్కర్ వర్ధంతి వేడుకలను పలు కుల, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భారతీయ బౌద్ధ మహాసభ, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్, రమామాత మహిళా మండలి, సమతా సైనిక్ దల్, మాల సంక్షేమ సంఘం, తదితర సంఘాలు, రాజకీయ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళ్లర్పించారు. బుద్ధ వందనం గావించారు.

# ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ

**ములుగు, మహా:** ములుగు మండలం రాయినిగూడెం పీహెచ్ సీ పరిధిలోని మల్లంపల్లి, పందికుంట ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎన్. గోపాల్ రావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రాల పరిధిలోని అర్హులైన వారందరికీ సికిల్ సెల్ పరీక్షలు నిర్వహించాలని, జాతీయ కార్యక్రమాల లక్ష్య సాధనలో నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి సాం, మామం పిల్లల గురించి ఆరాతీశారు. బాలామృతం వంటి పోషకాహారాన్ని అందించాలని, పోషకాహార ప్రాముఖ్యతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అంగన్వాడీ టీచర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో పోషకాహార ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్, రాయి



నిగూడెం పీహెచ్ సీ వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.


# రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌కు కాంగ్రెస్ నాయకుల ఘన నివాళి




**ఆదిలాబాద్ మహా :** రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేథావి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. అంబేద్కర్ వర్ధంతి వేడుకలను పురస్కరించుకుని ఆదిలాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో ఆయన విగ్రహానికి ఘన నివాళ్లర్పించారు.పుష్పాంజలి ఘటించి సేవలు కొనియాడారు. జై భీమ్ జై భీమ్, బోలో బాబా సాహెబ్ అంబేద్కర్ కీ జై అంటూ నినాదాలు చేశారు. దేశంలోని ప్రతి పౌరుడు అంబేద్కర్ దేశానికి అందించిన రాజ్యాంగంలోని సూత్రాలకు అనుగుణంగానే నడుచుకోవాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నగేష్ అన్నారు. ఇవాళ స్వాతంత్ర ఫలాలు, హక్కులు పొందుతున్నామంటే అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనేనని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బండారి సతీష్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రంగినేని శాంతన్ రావు, ఆదిలాబాద్ అసెంబ్లీ సెక్రటరీ పవార్ వసంత్, నాయకులు ఎస్.సి వింగ్ ,సుధాకర్ గౌడ్,ఎల్మ రామ్ రెడ్డి,బాసా సంతోష్,అఫ్రోజ్ ఖాన్,రమేష్,చంద్రకాంత్ రెడ్డి,అజీజ్, మహిళా నాయకురాలు శ్రీలేఖ ఆదివాసీ పాల్గొన్నారు.

# ఐఎమ్ ఏ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్

**నిర్మల్ మహా :** ఇండియన్ మెడికల్ అసోషియేషన్ నిర్మల్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో ఆర్టీసి ఉద్యోగులకు హైపర్ టెన్షన్, దయాబెటిస్ నిర్ధారణ పరీక్షలను చేపట్టారు. ఈ శిబిరంలో దాదాపు 90 మంది ఆర్టీసీ సిబ్బందికి పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి తెలంగాణ మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ తరపున ఉచితంగా మందులు అందజేశారు. ముందుగా ఈ శిబిరాన్ని ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. విభాగం సిబ్బంది విజయేందర్‌కుమార్, సంతోష్, ఆర్.గంగాధర్ తగిన ఏర్పాట్లు చేశారు. ఈ శిబిరంలో వైద్యులు దామెర రాములు, ముఖేష్, ప్రశాంత్, దయాకర్ యాదవ్ ,శ్రీనివాస్, ప్రభాకర్ రావు, వేణుగోపాల కృష్ణ, ప్రవీణ్ వైద్య సేవలందించగా విజయ పాథలోజికల్ ల్యాబ్ టెక్నీషియన్ నేరెళ్ల హన్మంతు ఆధ్వర్యంలో డయాగ్నో పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎమ్ఏ అధ్యక్షుడు డా.మురళీధర్, కార్యదర్శి ప్రమోద్ ,చంద్రారెడ్డి, ముఖేష్ నిధి , రమేష్, తెలంగాణ మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ అధ్యక్షుడు బి.ప్రవీణ్, సంయుక్త కార్యదర్శి ఉదయ్‌రెడ్డి, కోశాధికారి ఎ.విజయ్ తదితరులు పాల్గొన్నారు.






# పెరిగిన సంపద

**ముంబై, డిసెంబర్ 5:** దేశీయ స్టాక్ మార్కెట్లు పడుతూ.. లేస్తూ.. పయనించినా, ఆఖర్లో మాత్రం లాభాల్లోనే ముగుస్తున్నాయి. ఇలా వరుసగా 5 రోజుల్లో మదుపరుల సంపద సైతం లక్షల కోట్ల రూపాయల్లో పెరగడం విశేషం. గురువారం ఒక్కరోజే బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 809.53 పాయింట్లు లేదా 1 శాతం పుంజుకొని 81,765.86 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 1,361.41 పాయింట్లు ఎగబాకడం గమనార్హం. అయితే ఈ దశలో మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో సూచీ దిగిరాక తప్పలేదు. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 240.95 పాయింట్లు లేదా 0.98 శాతం ఎగిసి 24,708.40 దగ్గర నిలిచింది.

### అమెరికా జోష్

భారతీయ ఈక్విటీలు ఇంతలా బలపడటానికి అమెరికా మార్కెట్ల ర్యాలీ బాగా కలిసొచ్చింది. అగ్రరాజ్య ఆర్థిక వ్యవస్థ ఆకర్షణీయ వృద్ధిని కనబరుస్తుండటం, ద్రవ్యోల్బణం దిగొస్తుండటంతో తొలిసారి డోజోన్స్ 45వేల మార్కును దాటింది. అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించిన దగ్గర్నుంచీ అమెరికా వృద్ధి సూచీలు పరుగులు పెడుతున్నాయి మరి. అక్కడి ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ చీఫ్ పావెల్ కూడా దేశ ఆర్థిక ముఖచిత్రం బాగుపడిందని కొనియాడటం.. మార్కెట్ సెంటిమెంట్‌ను మరింత బలపర్చింది. ఇక దేశీయంగా చూస్తే.. ఐటీ కంపెనీల షేర్లు ఇన్వెస్టర్లను అమితంగా ఆకట్టుకున్నాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా షేర్లు భారీ లాభాలను అందుకున్నాయి. ఐటీ రంగ సూచీ గరిష్ఠంగా 1.96 శాతం పెరిగింది.

### ఎఫ్ఐఐ కొనుగోళ్లు

గతకొంత కాలంగా దేశీయ మార్కెట్ల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ దిశగా అడుగులు వేస్తున్న విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ).. మళ్లీ కొనుగోళ్ల వైపు వచ్చారు. బుధవారం రూ. 1,797.60 కోట్ల విలువైన షేర్లను కొన్నట్టు స్టాక్ ఎక్స్చేంజీ వర్గాలు తెలిపాయి. దీంతో గురువారం సైతం ఇదే జోష్ ఉందన్న అంచనాలు వస్తున్నాయి. ఇక సెన్సెక్స్‌లో టైటాన్, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లూ పెరిగాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ 0.27 శాతం, స్మాల్‌క్యాప్ 0.16 శాతం అందిపుచ్చుకున్నాయి. ఇక శుక్రవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష నిర్ణయాలు ఉండనున్నాయి. దీంతో మార్కెట్ ట్రేడింగ్‌పై ఈ ప్రభావం ఎక్కువేనని చెప్పవచ్చు. గత ఏడాది ఏప్రిల్ నుంచి కీలక వడ్డీరేట్లను ఆర్బీఐ యథాతథంగానే ఉంచుతున్న విషయం తెలిసిందే.

### రూ.458 లక్షల కోట్లకు..

వరుసగా ఐదోరోజూ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగియడంతో ఆయా సంస్థల మార్కెట్ విలువ కూడా అదే స్థాయిలో పెరుగుతూపోతున్నది. గడిచిన 5 రోజుల్లో బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.15,18,926.69 కోట్లు ఎగిసి రూ.4,58,17,010.11 కోట్లకు (5.41 ట్రిలియన్ డాలర్లు) చేరింది. ఈ ఐదు రోజుల్లో సెన్సెక్స్ 2,722.12 పాయింట్లు లేదా 3.44 శాతం పుంజుకున్నది. 'అంతర్జాతీయ మార్కెట్లలో డోజోన్స్, ఎస్అండ్‌పీ 500, నాస్‌డాక్ లాభాల్లో కదలాడుతుండటం.. భారతీయ మార్కెట్లకు లాభిస్తున్నది' అని మెహెతా ఈక్విటీస్ లిమిటెడ్ రిసెర్చ్ విభాగం సీనియర్ ఉపాధ్యక్షుడు ప్రశాంత్ తాప్సే అన్నారు.

# సన్‌టెక్ ఎనర్జీ నుంచి ట్రూజెన్ సోలార్ బ్రాండ్

## ప్రచారకర్తగా మహేశ్ బాబు

హైదరాబాద్, డిసెంబర్ 5: ప్రముఖ సోలార్ ఎనర్జీ సంస్థ సన్‌టెక్ ఎనర్జీ.. తాజాగా మరో బ్రాండ్ ట్రూజెన్ సోలార్ బ్రాండ్‌ను మార్కెట్‌కు పరిచయం చేసింది. ఈ బ్రాండ్‌కు మార్కెట్లో మరింత ప్రచారం కల్పించడానికి తెలుగు హీరో మహేష్ బాబును ప్రచారకర్తగా నియమించుకున్నది. ఈ సందర్భంగా కంపెనీ ఫౌండర్, ఎండీ భవాని సురేశ్ మాట్లాడుతూ..పునరుత్పాదక విద్యుత్ రంగంలో వస్తున్న పెను మార్పులకు అనుగుణంగా సరికొత్త బ్రాండ్‌ను పరిచయం చేసినట్లు, దేశంలో ఐదు అతిపెద్ద సోలార్ ఈపీసీ కంపెనీల్లో ఒకటిగా నిలిచేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు.

ఇందుకోసం తెలుగు హీరో మహేష్ బాబును బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకున్నట్లు చెప్పారు. అలాగే వ్యాపార విస్తరణలో భాగంగా తెలుగు రాష్ట్రాల్లో కొత్తగా 150కి పైగా డీలర్లను నియమించుకోనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం ఇరు రాష్ట్రాల్లో 60 డీలర్లు ఉన్నారు. దేశవ్యాప్త విస్తరణలో భాగంగా మధ్యప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల్లో ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లను నెలకొల్పుతున్నట్లు, తద్వారా ఆయా రాష్ట్రాల్లో సౌర పరికరాలు విక్రయించడానికి మరింత సులభతరం కానున్నదన్నారు.



# లక్ష డాలర్లకు బిట్‌కాయిన్



**న్యూయార్క్, డిసెంబర్ 5:** అదృశ్య కరెన్సీ బిట్‌కాయిన్ జెట్‌స్పీడ్ వేగంతో దూసుకుపోతున్నది. రోజుకొక రికార్డు స్థాయికి చేరుకుంటున్న ఈ బిట్‌కాయిన్ తాజాగా లక్ష డాలర్లకు చేరుకున్నది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంఫ్ గెలిచినప్పటీ నుంచి ఈ కరెన్సీ భారీగా పెరుగుతున్నది. ఈ నేపథ్యంలో గురువారం బిట్‌కాయిన్ విలువ 103,400 డాలర్లకు ఎగబాకింది. ఈ ఏడాది ఈ అదృశ్య కరెన్సీని కొనుగోలు చేసిన వారు కోటీశ్వరులైనారని మార్కెట్ వర్గాలు వెల్లడించాయి.

# ఈసారీ వడ్డీరేట్లు యథాతథం?

## నేడే ఆర్బీఐ ద్రవ్యసమీక్ష

**ముంబై, డిసెంబర్ 5:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తమ ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష నిర్ణయాన్ని శుక్రవారం ప్రకటించబోతున్నది. అయితే ఈసారి కూడా కీలక వడ్డీరేట్లను యథాతథంగానే ఉంచవచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి. గత ఏడాది ఏప్రిల్ నుంచి రెపో రేటును గరిష్ఠ స్థాయిలోనే సెంట్రల్ బ్యాంక్ ఉంచుతూ వస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో మరోమారు ఈ రేట్ల జోలికి వెళ్లకుండానే ద్రవ్యసమీక్షను ఆర్బీఐ ముగించవచ్చన్న అభిప్రాయాలు అటు బ్యాంకింగ్, ఇటు ఆర్థిక నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నాయి. రిటైల్, హోల్‌సేల్ ద్రవ్యోల్బణాలు బాగా పెరుగడమే ఇందుకు కారణం. అక్టోబర్‌లో ఏకంగా వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 6.21 శాతానికి చేరిన సంగతి విదితమే. కాగా, మిశ్రమ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్)ని తగ్గించే వీలుందన్న అంచనాలున్నాయి. ఇదే జరిగితే బ్యాంకులకు నిధుల లభ్యత పెరుగుతుంది. ఫలితంగా ఆయా రంగాలకు చౌకగా రుణాలు లభిస్తాయి. వడ్డీరేట్లను తగ్గించకుండా ఈ రకంగా మార్కెట్‌కు ఊరటనివ్వాలని ఆర్బీఐ చూస్తున్నదని చెప్తున్నారు.

### మరో 27 టన్నుల గోల్డ్

రిజర్వు బ్యాంక్ క్రమంగా బంగారం నిల్వలను పెంచుకుంటున్నది. అక్టోబర్ నెలలో సెంట్రల్ బ్యాంకులు 60 టన్నుల గోల్డ్‌ను కొనుగోలు చేయగా, దీంట్లో రిజర్వుబ్యాంక్ అత్యధికంగా 27 టన్నుల గోల్డ్‌ను కొనుగోలు చేసినట్లు వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ తాజాగా వెల్లడించింది. ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబర్ వరకు మొత్తంగా 77 టన్నుల గోల్డ్ కొనుగోలు చేయగా, దీంట్లో సెంట్రల్ బ్యాంక్ 27 టన్నులు కొనుగోలు చేసినట్లు ఐఎంఎఫ్ విడుదల చేసిన నివేదిక ఆధారంగా డబ్ల్యూజీసీ ఈ విషయాన్ని వెల్లడించింది.

## క్రీడా వార్తలు | SPORTS NEWS

# అవును.. డిసెంబర్ 22న నా పెళ్లి : స్టార్ షట్లర్

భారత బ్యాడ్మింటన్ స్టార్, డబుల్ ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు (PV Sindhu) త్వరలో పెళ్లి పీటలు ఎక్కబోతున్న విషయం తెలిసిందే. హైదరాబాద్‌కు చెందిన 29 ఏళ్ల వెంకట దత్త సాయి (Venkata Datta Sai)ని సింధు మనువాడనుంది. ఈ నేపథ్యంలో తన పెళ్లి గురించి స్టార్ షట్లర్ తొలిసారి స్పందించారు. ఇటీవలే ఓ కార్యక్రమంలో పాల్గొన్న సింధును విలేకరులు పెళ్లి గురించి ప్రశ్నించారు. ఇందుకు ఆమె స్పందిస్తూ.. 'అవును, ఈనెల 22న నేను పెళ్లి చేసుకోబోతున్నాను' అంటూ సమాధానమిచ్చారు. కాగా, సింధు పెళ్లి చేసుకునే వెంకట దత్త సాయి.. పోసిడెక్స్ టెక్నాలజీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈ విషయాన్ని ఆమె తండ్రి పీవీ రమణ రెండు రోజుల క్రితం ప్రకటించిన విషయం తెలిసిందే. 'మా రెండు కుటుంబాలకు ఎప్పటి నుంచో పరిచయం ఉంది. కానీ నెల క్రితమే పెళ్లి ఖాయమైంది. జనవరి నుంచి సింధు వరుస టోర్నీలు ఆడబోతోంది. అందుకే సాధ్యమైనంత తొందరగా పెళ్లి చేయాలని భావించాం. డిసెంబర్ 22న పెళ్లి వేడుక జరిపించేయాలని ఇరు కుటుంబాలు నిర్ణయించుకుని ముహూర్తం పెట్టించాం. 24న హైదరాబాద్‌లో రిసెప్షన్ ఉంటుంది. వచ్చే సీజన్ చాలా ముఖ్యమైనది కాబట్టి సింధు త్వరలోనే ప్రాక్టీస్ కూడా మొదలుపెడుతుంది' అని ఆమె తండ్రి పీవీ రమణ తెలిపారు. వీరి వివాహం ఈనెల 22న ఉదయ్‌పూర్‌లో అంగరంగా వైభవంగా జరగనుంది. ఇక డిసెంబర్ 20న సింధు పెళ్లి వేడుకలు మొదలు కానున్నాయి.






# చాంపియన్స్ ట్రోఫీ హైబ్రిడ్ మోడల్ ఖరారు

న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీ (2025) ని హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించేందుకు ఐసీసీ దాదాపు సిద్ధమైంది. దుబాయ్‌లో భారత్ మ్యాచ్‌ల నిర్వహణతో పాటు 2027 వరకు ఐసీసీ టోర్నీల్లో హైబ్రిడ్ పద్ధతి కొనసాగించేందుకు చర్చలు దాదాపు కొలిక్కి వచ్చినట్లు తెలిసింది. గురువారం ఐసీసీ కొత్త చైర్మన్ జై షా, బోర్డు డైరెక్టర్లు దుబాయ్‌లో సమావేశమయ్యారు. పీసీబీ డిమాండ్ చేసిన అదనపు మొత్తానికి ఆమోదం లభించలేదని అని ఐసీసీ వర్గాలు పేర్కొన్నాయి.

# ఆ క్రీడాంశాలను తీసేశారు..

## యూత్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ఎదురుదెబ్బ



న్యూఢిల్లీ: డాకర్(సెనెగల్) వేదికగా 2026లో జరిగే ప్రతిష్ఠాత్మక యూత్ ఒలింపిక్స్‌లో భారత పతక అవకాశాలకు ఘోరమైన ఎదురుదెబ్బ తగిలింది. భారత్ కచ్చితంగా పతకాలు సాధిస్తుందనుకున్న షూటింగ్, వెయిట్‌లిఫ్టింగ్, హాకీ లాంటి క్రీడాంశాలను యూత్ ఒలింపిక్స్ నుంచి తీసేశారు. ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ(ఐవోసీ) ఎగ్జిక్యూటివ్ బోర్డు గురువారం ఈ నిర్ణయం తీసుకుంది. 2018లో జరిగిన యూత్ గేమ్స్‌లో భారత్‌కు షూటింగ్‌లో నాలుగు, హాకీలో రెండు, వెయిట్‌లిఫ్టింగ్ ఒక పతకం వచ్చింది. రానున్న యూత్ ఒలింపిక్స్‌లో భారత పతకాలపై ప్రభావం పడనుంది.



# గుకేశ్, లిరెన్ 6వ డ్రా

## ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్

**సింగపూర్:** ప్రతిష్ఠాత్మక ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో డ్రాల పరంపర కొనసాగుతున్నది. గురువారం డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్, దొమ్మరాజు గుకేశ్ మధ్య జరిగిన తొమ్మిదో రౌండ్ పోరు డ్రాగా ముగిసింది. దీంతో వరుసగా మెగాటోర్నీలో ఇద్దరి మధ్య ఆరో డ్రా నమోదైంది. తొమ్మిది రౌండ్లు ముగిసేసరికి గుకేశ్, లిరెన్ ఇద్దరు 4.5 పాయింట్లతో సంయుక్తంగా కొనసాగుతున్నారు. ఎవరైతే మరో 3.5 పాయింట్లు సాధిస్తారో వారి ఖాతాలో ప్రపంచ టైటిల్ చేరుతుంది. ఇద్దరి మధ్య తొమ్మిదో రౌండ్ గేమ్ 54 ఎత్తుల్లో ముగిసింది.



ప్రస్తుతం సోషల్ మీడియాలో డ్యాన్సర్లకు సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. లేటేస్ట్ సూపర్ హిట్ పాటలకు అదిరిపోయే స్టెప్పులు వేస్తూ నెటిజన్లను ఆకట్టుకుంటున్నారు. దీంతో తక్కువ సమయంలోనే నెట్టింట చాలా ఫేమస్ అవుతున్నారు. అయితే ఇప్పటి వరకు నెట్టింట పాపులర్ అయిన చాలా మంది అటు వెండితెరపై తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. పైన ఫోటోలో కనిపిస్తున్న అమ్మాయి సైతం ఇప్పుడు అదే జాబితాలోకి వస్తుంది. ఆమెకు డ్యాన్స్ అంటే చాలా ఇష్టం. చిన్నప్పుడే డాన్స్ నేర్చుకుంది. ఇక సోషల్ మీడియాలో నిత్యం డ్యాన్స్ వీడియోస్ షేర్ చేస్తూ చాలా పాపులర్ అయ్యింది. దీంతో ఇప్పుడు ఏకంగా ఓ స్టార్ హీరోతో స్క్రీన్ షేర్ చేసుకుంటుంది. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా.. ? ఇంకెవరు ప్రభాస్ జోడిగా నటిస్తోన్న ఇమాన్వీ. యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం చేతినిండా సినిమాలతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. అందులో డైరెక్టర్ హను రాఘవపూడి

## డ్యాన్స్ వీడియోలతో మెంటలెక్కించిన అమ్మాయి..

### పాన్ ఇండియా స్టార్ సరసన ఛాన్స్..

దర్శకత్వం వహిస్తున్న ప్రాజెక్ట్ ఒకటి. ఇందులో కథానాయికగా ఎంపికైంది ఈ అమ్మాయి. ఢిల్లీలో పుట్టిపెరిగిన ఇమాన్వికి డాన్స్ అంటే చాలా ఇష్టం. అటు ఎంబీఏ చేసి జాబ్ చేస్తూ ఇటు డ్యాన్స్ వీడియోస్ చేస్తూ ఉండేది. ఇక తండ్రి ఇచ్చిన సలహాతో జాబ్ మానేసి సొంతంగా యూట్యూబ్ ఛానల్ స్టార్ట్ చేసి కొత్త కొత్త స్టెప్పులతో యువతను ఆకట్టుకుంది. ఆమె డ్యాన్స్ వీడియోలకు విపరీతమైన ఫాలోయింగ్ పెరిగింది. ఇమాన్వీకి ఇన్ స్టాలో 9 లక్షలకు పైగా ఫాలోవర్స్ ఉన్నాయి. సోషల్ మీడియాలో ఆమె చేసే డ్యాన్స్, పాటకు తగినట్లుగా ఆమె ఇచ్చే ఎక్స్ ప్రెషన్స్ చూసి డైరెక్టర్ హను రాఘవపూడి సైతం ఫిదా అయ్యారు. దీంతో ఆమెకు ఏకంగా ప్రభాస్ సరసన ఛాన్స్ ఇచ్చారు. ప్రస్తుతం ఈ సినిమా రెగ్యూలర్ షూటింగ్ జరుగుతుంది.




## కాలుతో సైకిల్ స్టాండ్ వేస్తున్న రామ్..

### ఆసక్తి రేకెత్తిస్తోన్న రాపో 22 ఫస్ట్ లుక్

డబుల్ ఇస్మార్ట్ డిజాస్టర్ తర్వాత సినిమాల ఎంపికలో రూటు మార్చేశాడు రామ్ పోతినేని (Ram Pothineni). ఈ సారి ఎలాగైనా హిట్టు కొట్టాలని చూస్తున్న రామ్ కంప్లీట్ కొత్త కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి ఫేం పీ మహేశ్ బాబు (Mahesh Babu P) దర్శకత్వంలో రామ్ (Ram Pothineni) నటిస్తోన్న తాజా చిత్రం రాపో 22 (RAPO 22). మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ తెరకెక్కిస్తోన్న ఈ సినిమా ఇటీవలే పూజాకార్యక్రమాలతో గ్రాండ్‌గా లాంఛ్ అయింది. మీకు సుపరిచితుడు.. మీలో ఒకడిని పరిచయం చేస్తామని మేకర్స్ చెప్పారని తెలిసిందే. తాజాగా అందరిలో ఒకడు రామ్ పాత్రను పరిచయం చేశారు. చేతిలో నోట్ బుక్ పట్టుకుని కాలుతో సైకిల్ స్టాండ్ వేస్తున్న రామ్ లుక్ నెట్టింట ట్రెండింగ్ అవుతోంది. ఇంతకీ రామ్ ఈ చిత్రంలో స్టూడెంట్‌గా కనిపించబోతున్నాడా..? లేదంటే టీచర్‌గా మారి పాఠాలు చెప్పబోతున్నాడా..? అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు వెయిట్ చేయాల్సిందే. ఈ మూవీలో మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ తెరకెక్కిస్తోన్న ఈ చిత్రానికి కోలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ల ద్వయం వివేక్‌మెర్విన్ సంగీతం అందిస్తున్నారు. మేరిక్రిస్మస్, మలైకొట్టై వాలిబన్ ఫేం సినిమాటోగ్రఫర్ మధు నీలకందన్ ఈ సినిమాకు పని చేస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. నేషనల్ అవార్డు విన్నింగ్ టెక్నీషియన్ అక్కినేని శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నాడు.



## శ్రీశైలం మల్లన్న సేవలో నాగచైతన్య - శోభిత



అక్కినేని నాగచైతన్య, శోభిత ధూళిపాళ్ల వివాహ బంధంతో ఒక్కటైన విషయం తెలిసిందే. బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో వీరి వివాహ అంగరంగ వైభవంగా జరిగింది. తాజాగా నూతన జంట శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని సందర్శించారు. అక్కినేని నాగార్జునతో కలిసి చైతూశోభిత జంట శుక్రవారం శ్రీశైలం వెళ్లారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఉదయం ఆలయానికి చేరుకున్న వీరికి అర్చకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం పండితులు వేదాశీర్వచనం చేశారు.

## భయంతో థియేటర్ బయటికి పరుగులు తీసిన ప్రేక్షకులు

### ముంబైలో ఆగిపోయిన పుష్ప 2 షో



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 ది రూల్ చిత్రం విజయవంతంగా ప్రదర్శితమవుతున్న విషయం తెలిసిందే. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్ టాక్‌తో నడుస్తుంది. ఇక నార్త్ సౌత్ అని తేడ లేకుండా అన్ని థియేటర్లలో హౌజ్‌ఫుల్ బోర్డులు కనిపిస్తున్నాయి. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా ప్రదర్శితమవుతున్న ముంబై బాంద్రాలోని గెలాక్సీ థియేటర్‌లో పెప్పర్ స్ప్రే కలకలం రేపింది. సినిమా సెకండ్ ఆఫ్‌కి ముందు.. గుర్తు తెలియని వ్యక్తి థియేటర్లో పెప్పర్ స్ప్రే చేశాడు. దీంతో అక్కడ ఉన్న ప్రేక్షకులు ఊపిరి ఆడక ఉక్కిరిబిక్కిరి అవుతూ.. కొంతమంది దగ్గుతూ భయంతో థియేటర్ బయటికి పరుగులు తీశారు. దీంతో థియేటర్ యాజమాన్యం పెప్పర్ స్ప్రే ఘాటును తొలగించే ప్రయత్నం చేయడంతో పాటు 30 నిమిషాల వరకు సినిమా ప్రదర్శనను నిలిపివేసింది. అనంతరం మళ్లీ ప్రదర్శించింది. ఈ ఘటనపై థియేటర్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అనుమానం ఉన్నవారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం.

అగ్ర కథానాయిక కీర్తి సురేష్ తన చిరకాల మిత్రుడు ఆంటోనితో పెళ్లిపీటలెక్కేందుకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. ఇటీవల తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సందర్భంగా కీర్తి సురేష్ తన పెళ్లి గురించి క్లారిటీ ఇచ్చారు. గోవాలో పెళ్లి జరుగుతుందని, త్వరలో అన్ని వివరాలను వెల్లడిస్తానని చెప్పింది. అయితే, పెళ్లి డేట్ మాత్రం చెప్పలేదు ఈ 'మహానటి'. అయితే, తమిళ మీడియా నుంచి అందుతున్న సమాచారం మేరకు కీర్తి సురేశ్ వివాహం ఈనెల 12న జరగనున్నట్లు తెలిసింది.

## ఆంటోనితో పెళ్లి..

### అప్‌డేట్ ఇచ్చిన కీర్తి సురేశ్

ఈ నేపథ్యంలో పెళ్లి టైమ్ దగ్గరపడుతుండటంతో ఈ చెన్నై బ్యూటీ తాజాగా గోవా ఫ్లైట్ ఎక్కేసింది. ఓ మేరకు అప్‌డేట్ ఇస్తూ బోర్డింగ్ పాస్‌లను ఇన్‌స్టా స్టోరీస్‌లో షేర్ చేస్తూ #KAwedding అని పేర్కొంది. ప్రస్తుతం ఈ ఫొటో వైరల్ అవుతోంది. ఇక కీర్తి సురేష్‌ను పెళ్లాడబోతున్న ఆంటోని ఆమె కాలేజీ స్నేహితుడు. దాదాపు 15 ఏండ్లుగా వీరిమధ్య మంచి స్నేహసంబంధాలున్నాయి. ఇద్దరి కుటుంబాలు కూడా సన్నిహితంగా ఉంటాయని తెలిసింది. ఆంటోని కేరళలో వ్యాపారవేత్తగా రాణిస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com